సీరియల్ నాటిక

# భక్తలీల

పి. శ్రీనివాసరావు

## రంగము ౧.

[ప్రవేశము: స్వర్ణ భద్రా నదీ తీరమందలి శ్రీపుర పట్టణమున కనతి దూరమున మధుసూదనుని కుటీరము.

ప్రవేశము: మధుసూదనుని భార్య శాంతాదేవి కుమారునితో]

శాంతాదేవి:

తే॥ గీ॥ ఏడువకు ఏడువకు తండ్రి! । ఏడ్వ వద్దు
గొంతు యార్చుక పోవును । గోల మాను;
వేడి కన్నీటి చుక్కలు । విడువ బోకు,
అందమౌ నీదు చెక్కిళ్లు । కందు నయ్య!

(అడ్డాలలో బిడ్డ నిడుకొని) నాయనా! నాయనా! మా యట్టి పేదవారి గర్భమునందేల జన్మించితివి? ఏడువకు తండ్రి! ఏడువకు. (బిడ్డ డేడ్చును) ఊరుకో నాన్నా! ఊరుకో!

(ప్రవేశము మధుసూదనుడు)

మధు: శాంతం! శ్రీపురమంతయు గాకివలె దిరిగితిని. కాని ఈ మధుసూదనునకు గోకురెడు పాల చుక్కలు లభించినవి కావు. అయ్యో! పిల్లవాని నెట్లు పోషించగలము, ఎట్లు కాపాడగలము?

తే॥ గీ॥ గూడు నిర్మించి పిల్లల । గూట బెట్టి
యొకటి గాచుచు నెల్లెడ । నొకటి తిరిగి
నోట యాహారమును దెచ్చి । నోట గుడిపి
రక్షణము సేయుచుండదే । పక్షి కులము.

అట్టి పక్షులకన్న హీనులమైతిమే.

శాంత: మన కడుపున గనినందుకు మనము పోషించవలదా? అట్లు పోషింపకున్న శిశుహత్యా దోషము కలుగదా?

మధు: వెనుక గలుగునో మానునో! ఇప్పుడు కండ్లార పిల్లవాని కష్టముల జూచి భరించు టెట్లు?

శాంత: అయ్యో! కలుగక కలుగక సంతానము కలిగ నన్న సంతోషము లేక పోయినదే... (బిడ్డ డేడ్చును)— ఏమీ! నాయనా! ఆకలా! ఈ పాపిష్టి గర్భమునందేల జన్మించితివి? దాహమా! దాహమా?— (భర్తతో) మీరు లోపలకు బోయి కొంచెము నీళ్ళైనను దీసికొనిరండు. (మధుసూదనుడు వెళ్లును) అయ్యో! దైవమా! ఈ పసిపాప నెట్లు పోషించుట? రక్షింపవా! దయామయా! రక్షింపవా?—

ఉ॥ శ్రీ లలనా మణీ హృదయ ।
సీమ వసించి వినోద లీల స
త్పాలన సేయవే కడు ఖ ।
ధంబుగ విశ్వము నెల్ల, భక్త హృ
ల్లోల! సురాదిలోల! ముని ।
లోల! దయాంచితపాల! సత్య సం
శీల! గజేంద్రపాల! గుణ ।
శీల! సుగాన వినోద సంచలా!

(ప్రవేశము మధుసూదనుడు నీళ్ళతో)

మధు: అప్పా! నిన్ను బోషించుటకు శక్తివంతులము గాము. నీకు తల్లి దండ్రులు లేరనుకొనుము నాన్నా!

బ్రతికియున్నను చచ్చిన వారితో సమానులమని భావించుము తండ్రీ!

చం॥ మల మల గర్భ గోళమున।
మాడెడి యాకటి చిచ్చు జెంది, కో
యిలగతి కూయు కంఠమున।
నేడిచి, యాటల నాడకుండ, నీ
కల కల నవ్వుమోము గడు।
గాంతి విహీనము జేసి, దప్పిచే
నలసితివా కుమార! వెస।
అమ్మను అయ్యను దిట్ట బోకుమా!

(భార్యకు నీళ్లనొసంగ ఆమె బిడ్డనికి బోసి బిడ్డనితో)

కాంత : ఓహో! ఓహో! నవ్వుచుంటివా!

కం॥ జో! జో! బంగరు పాపా!
జో! జో! రత్నాల పాప! జో! జో! పాపా!
జో! జో! సుందర రూపా!
జో! జో! మా ముద్దుపాప! జోజో! జోజో!

(జోల బాడి బిడ్డను నిద్రపుచ్చి భర్తతో) బిడ్డను నేదదీరి నిదురించెను. మీరు మూడు దినములనుండి తిండిలేక చాల నీరసించి యున్నారు. కొంచెమాకలి బాధ దీర్చుకొనుటకు లెండు. అన్నములేదు సరేగదా ఫలములపైన దిని ప్రాణము నిలబెట్టుకొనుడు.

మధు : నాకు మూడు దినములనుండి తిండి లేకున్న నేమి! ఒకవారమునుండి నీకు తిండిలేదే?—ఆ పండ్ల నారగించి నీ ప్రాణముల నిలబెట్టుకొనుము. నేనీ యడివికి బోయి ఫలముల సంపాదించి పిమ్మట నా యాకలిదీర్చుకొందును. నీ ప్రాణములకన్న నా ప్రాణములు ఎక్కువేమి?— పిల్లవాని కుదయమునుండి గొకురెడు పాల చుక్కలుం బట్టలేకుంటిమే! వాని కడుపున గొంచెము పాలంబోయ నిదే గ్రుక్కెడు నీటిపైన ద్రాగుటకు మనస్సు పోవుట లేదు.

కాంత : అయ్యో! మీకూ పిల్లవానికి కలుగని యాకలి నాకే గలుగునా? మీరులేని నాకీ ప్రాణము లేల?

(ప్రవేశం రామిరెడ్డి)

రెడ్డి : మధుసూదనముగారూ! నమస్కారములు.

మధు : చిరాయురస్తు. జమిందారు రామిరెడ్డిగారు! దయ చేయుడు. కాంతా!

(కాంతమ్మవైపు చూడ కాంతమ్మ దర్భాసనమును దెచ్చివేసి)

కాంత : బాబూ! ఈ పేదవారి కుటీరమున కుర్చీలా! తివాసులా! దయచేసి కూర్చొనుడు.

(రెడ్డి కూర్చొని ఆశ్చర్యముగా)

రెడ్డి : మధుసూదనముగారూ! ఈ విడ మీ భార్యయా?

మధు : ఔను.

రెడ్డి : ఇటువంటి దాంపత్యమే దాంపత్యము.

మధు : రెడ్డిగారూ! ఎక్కడనుండి మీ రాక?

రెడ్డి : పాగుసూరుపోయి తిరిగి శ్రీపురమునకు వచ్చుచుండగా నా గుఱ్ఱము డెక్కలో ఇనుపగోలు గ్రుచ్చుకొనినది. ఆ ప్రక్కచెట్టున గుఱ్ఱమును గట్టి ఈ యెండవేళను కొంత మిక్కడాయాసము తీర్చుకొని పోవుటకు వచ్చితిని.

మధు : భాగ్యము.

కాంత : మీ రాకవలన ధన్యులము.

మధు : కాంత! ఫలములదెచ్చి రెడ్డిగారికిమ్ము.

(కాంత కుటీరములోనికి బోవును)

రెడ్డి : (తనలో) ఆహా! ఏమి సౌందర్యము! ఈమె కాలి గోటికయినా ప్రపంచములోని స్త్రీలు సరి యగుదురా! నేనీమె సౌఖ్యమును బొందలేకున్న నీ ప్రాణము లెందుకు?—ఎట్లయినను వీరితో స్నేహముచేసి నా కార్యము సాఫల్యము జేసికొనవలసియున్నది. ధన మూల మిదం జగత్తు—ఏమున్నది?—వీరికి ధనాశ జూపవలసి యున్నది.

(కాంత ఫలములతో ప్రవేసించి రెడ్డి కొసంగును)

కాంత : ఈ పండ్లనారగింపుడు. మీకు బట్టెడన్నము పెట్ట లేకుండిన దరిద్రులము. మీయట్టి జమీందారులు, ధనవం

తులు, మాయట్టి సాధుల కుటీరములకు వచ్చి ఏమి తృప్తి బొందగలరు?

రెడ్డి: శాంతమైన మీ మనస్సుతో నిచ్చిన యీ ఫలములే పరమ సంతృప్తిని బొందించుచున్నవి.

శాంత: కొంచెము పాలనైనా యీయ లేకుంటిమి. ఈ నీటిని త్రాగి దాహశాంతిని బొందుడు. (నీళ్ళొసగును)

మధు: రెడ్డిగారూ! మా పిల్లవానికే పాలుబోసి పెంచలేకున్నాము. మీకు పాలనొసంగజాలని యభాగ్యులము.

రెడ్డి: (నీళ్ళను త్రావును) ఇదియే చాల మాధుర్యముగ నున్నది. కాని మీ పిల్లవానికి పాలులేవని తెలుపుచున్నారు. ఒక పాడియావును బంపెదను లెండి! దాని పాలుబోసి పెంచుడు. ఈ మాత్రము ప్రత్యుపకారము మీకు జేయలేనా?

శాంత: మేము ధన్యులము.

మధు: మీ మేలునకు కృతజ్ఞులము.

రెడ్డి: మీరు తిండిలేక ఇక్కడ యిడుములు పడుచున్నట్లున్నదే. శ్రీపురమునకు రాకూడదూ?

మధు: రెడ్డిగారూ! ఇక్కడ భగవంతుడు తాండవ మాడుచున్నట్లుడును. ఈ స్వర్ణభద్రా నదీ రాజమున్నూ, యిక్కడ ప్రకృతి శోభలున్నూ మాకు గలిగించిన లేమిని మరపించి మహా సంతోషమును కూర్చుచున్నవి.

రెడ్డి: నిజమే, ఈ కుటీరమే శాంత కుటీరము. మీ కుటీరమును విడిచి పెట్టుటకు నాకును మనస్సు పోవకున్నది.

మధు: చిత్తము, చిత్తము. దైవారాధనకు దగిన శాంతి యిచ్చటనున్నది.

తే॥ గీ॥ నిశ్చలంబుగ దేవుని । నెమ్మనమున
నిడి సమారాధనము జేయ । నచటి సృష్టి
చిత్రములు బోధ గరపి వి । చిత్ర గతిని
పరమ ధామంబు గాంచెడి । పథము జూపు.

రెడ్డి: నిజమే, అది నాకును తెలియును. కాని యీ అడవి ప్రదేశమందు మీకేమి సౌకర్యములు లభించును? శ్రీపురమునకు వచ్చిన మిమ్ముల నాదరించలేనా? మీకు మంచి పెంకుటిల్లిత్తును. తిండికి వలసిన సామగ్రినిత్తును. నగలనున్నూ యిత్తును. ఏమీ జమీందారుడనగు నే నా మాత్రము నీయలేనా? నాకు కొరతగలదా?

శాంత: రెడ్డిగారూ! మాకా మేడలు మిద్దెలకన్న నీ కుటీరమే చాలా యానందమును గలిగించుచున్నది. ఇక్కడి పండ్లు, నీవార ధాన్యములగంజి తృప్తి గలిగించుచున్నవి. ఆ నగలకన్న నిక్కడి పూవులే శోభగానుండును.

రెడ్డి: నిశ్చయముగ మీ కోమలమైన శరీరమునకు యీ పూవులే అందముగానుండ నగలేల? కాని మీ గర్భకుహరములు ఆకలి జ్వాలలకు మలమలమాడి పరితపించుచున్నవి. చక్కగా యోచించుకొని శ్రీపురమునకు వచ్చుటకు ప్రయత్నము జేయుడు. వేళ మిగులు చున్నది. నేనిక బోయెదను. నేటి మధ్యాహ్నము నా భటులు ఆవును దెచ్చి మీకప్పగించి గుఱ్ఱమును దోలికొని పోవుదురు. నాకు సెలవీయుడు.

శాంత: మధు: చిత్తము, చిత్తము.

(రెడ్డి పోవుచు తనలో)

రెడ్డి: తే॥ గీ॥ పూరుషుల కొంప ముంచగా । బుడమి లోన
బ్రహ్మ పుట్టించె బంగారు । బొమ్మ యనగ
చక్కదనముల కుప్ప యీ । చంద్ర వదన
బొంద నెందరు మదిలోన । గుందు వారొ!

(తెర వ్రాలును)

సీరియల్ నాటిక

# భక్తిలీల

శోలాకి శ్రీనివాసరావు

రంగము ౧.

ప్రదేశము: వైకుంఠము.

[ప్రవేశము: బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ఇష్టాగోష్ఠి సలుపుచుందురు]

బ్రహ్మ: తే. గీ॥ సృష్టి సృజయించు బ్రహ్మను। కష్ట మనకి

విష్ణు: స్థితిని గూర్చెడి విష్ణుడ। యతులితముగ

ఈశ్వ: లయముఘటియించు శివుడను। భయములేక

విష్ణు: సరిగ త్రైనాథ లీలల। నెరుగ నగునె?

(నారదుడు దూరమున వీణాగానము సలుప)

విష్ణు: బ్రహ్మ మానసపుత్రు డరుదెంచు చున్నట్లున్నదే!

బ్రహ్మ: ఏమి పుత్రుడు? ఏదో యొక కలహమును గల్పించుచునే యుండును.

ఈశ్వ: సర్వలోకముల కుపకార కరమగు కలహములు మీ అబ్బాయి కెంత మాత్రమును గళంకమును దీసికొనిరావు.

(ప్రవేశము నారదుడు)

నారద: తే॥ గీ॥ ఆదిమధ్యాంత మూర్తుల। నమల గుణుల
లోక కల్యాణ లోలుర। లోక హితుల
బ్రహ్మ విష్ణు మహేశ్వర। ప్రభుల ఘనుల
శ్రీ త్రినాథుల బ్రొక్కెద। చిత్తమలర!

విష్ణు: నారదా! రమ్ము. విశేషము లేమైన గలవా?

నార: దేవా! లేకుండుటేమి? వలసినన్ని గలవు.

బ్రహ్మ: అదిగో! అప్పుడే ఏదోయొకటి గల్పించెను.

ఈశ్వ: బిడ్డా! ఎప్పటినుండి నీ రాక?

నార: ఓ త్రినాథులారా! భూలోకమునుండి వచ్చుచున్నాను.

ఈశ్వ: తే॥ గీ॥ నారదా! భూమిలోగల। నరుల వార్త
లెల్ల దెలుప మాతోడ। నెరుక బరుపు
వినగ వేడుక జనియించె। ప్రేమ మాదు
భజనలను సల్పి సుఖముల। బడయు వారె?

నార: భూలోకమందు నీ కలియుగమున మానవులు భగవంతుని బూజింపలేక అధోగతి పాలగుచున్నారు. మానవులు తరించుటకు మార్గము లేదా?

విష్ణు: వారు మమ్ములను భజించి ముక్తిబొందుట కెన్నో మార్గములుండ మార్గము లేదాయని ప్రశ్నించు చుంటివేమి?

తే॥ గీ॥ భక్తి ప్రాధాన్యమని యెంచి। భజన సలిపి
మాదు పూజల మరువక। మమ్ము దలచి
మంచి నడవడి జరియించు। మానవులకు
మోక్ష సామ్రాజ్య పదవిని। బొంద నగును.

ఈశ్వ: అబ్బాయి సందేశమునందు విశేషము లేకుండుటలేదు. మానవజన్మ ముత్తమంబైనను మానవులు జ్ఞానశూన్యులై మూఢ విశ్వాసముల పాలై పాడు బడుచున్నారు.

విష్ణు: ఎట్లో వారు మనస్ఫూర్తిగా భజించుటే కర్తవ్యము.

బ్రహ్మ: భగవంతుని నామస్మరణ మొక్కటి చేయుట వలననే మానవులు తరించుటకు మార్గము గలదు. కనుక, వారు ధన్యులు. కడుం గడు ధన్యులు.

నార: మానవులలో సంఘీభావము మిక్కిలి తక్కువ. ఎందరో మతకర్తలున్నారు. ఎన్నోరకముల దేవాలయ

...యున్నవి. వారికి ఒక దేవుడుగాడు. ఒక జాతిగాదు, ఒక మతముగాదు, ఒక క్రమముగాదు.

ఈశ్వ: కాని, ఏదో విధమున మమ్ములను భజించుటే మాకు సంతృప్తిగా నున్నది!

నార: మతకర్తలు, మరియు శాస్త్ర పురాణాది వేత్తలు నున్నారు వారలు భూలోకమున నెన్నెని కఠిన శాసనములు చేసియున్నారు.

ఈశ్వ: నారదా! వారి శాసనము లెట్టివి?

నార: బ్రహ్మ క్షత్రియ వైశ్య శూద్రులనియు మాల మాదిగాది పంచములనియు, యింక నెన్నెన్నో పేర్లతో నెన్నెన్నో జాతులను గల్పించి కలహములు గల్పించి ఘోరమగు నెన్నో హత్యలు సల్పుచున్నారు.

బ్రహ్మ: సరే, జాతులతో నేమి ప్రసక్తిగలదు.

నార: వేదములు ఎవరుబడితే వారు చదువ రాదట, దేవాలయములకు ఎవరు బడితేవారు వెళ్లరాదట, దేవతా విగ్రహములను ఎవరుబడితే వారు ముట్టరాదట. ఏమీ! దేవుని భజించుటకు గాని, దేవుని చరిత్రలు చదువుటకు గాని తెలిసికొనుటకుగాని సర్వ మానవులకు సమమైన హక్కులేదా?

బ్రహ్మ: ఇంకేమి జరుగుచున్నది.

నార: ఇంకనెట్టి వింతలు జరుగుచున్నవి?

నార: ఉపవాస క్లేశముల ననుభవించ వలెనట. ఎందరో బ్రాహ్మణులకు భోజనాది సంతర్పణములుజేసి సంభావన లిచ్చి సంతృప్తి గలిగించవలెనట. ఎన్నినాళ్లో హోమాది కర్మలు చేయవలెనట. అట్లయిన భూలోకమునందెన్నో కోట్ల ప్రజలున్నారే? వారందరూ యిట్టి కఠినమైన నియమములను పాటించి మీ సాన్నిధ్యమును బొంద గలరా?—అందరికీ ధనమున్నదా? వారందరికీ గతియే లేదా?—దేవుడు లేడా?—వారందరూ తపో నిష్టా గరిష్ఠులై యజ్ఞ యాగాది కర్మలు చేయ గలరా?—ఓ త్రినాధులారా! మీరిట్లూరక మౌనము దాల్చి యున్నారేమి? ఇందుకు తగిన మార్గము లాలోచించి కాపాడుటకు కరుణ గలుగదా?—కర్తవ్య మూహింపుడు. మానవుల రక్షింపుడు.

ఈశ్వ: నారదా! నీవు చెప్పినదెల్ల విచారింప వలసి యున్నది.

నార: దేవా చెప్ప మరచితిని. కొందరు మద్యము, మాంసము భగవదార్పణము చేయుచున్నారు. కొందరు బలుల నొసంగి జీవహింస గావించుచున్నారు.

బ్రహ్మ: ఆశ్చర్య మాశ్చర్యము.

తే. గీ. మానవులె తప్పులను జేసి, మంచి బుద్ధి
నేరములు నెన్నో దేవుని? నెత్తి నుంచి
నింద జేయుచు నుందురు. నిశ్చయముగ
శక్తి విడనాడు వారికి? ముక్తి గలదె?

నార: అట్లయిన వారి గతి ఏమి గావలెను?

విష్ణు: దుష్ట కృత్యములు జేయువారు తత్ఫలమును తప్పక భూలోకమందే యనుభవించగలరు. ఎవరు నిశ్చలంబుగ భక్తితో మమ్ముల భజింతురో వారికి మోక్ష మొసగుదుము.

నార: అయిన భక్తి కుదురుటకుగాను ఈ కలియుగమునకు దగిన వ్రతమొకటి కల్పించి కఠినమైన నియమములు లేకుండా సూక్ష్మమున మోక్షమును పొందుటకు తగినట్లుగా నియమించి, విశ్వాస మొందవుటకుగాను కొన్ని యద్భుత మహత్తులను చూపెట్టి భూలోకమును బాగు పరుప యత్నింపుడు.

విష్ణు: నారదా! నీవు వచించునట్లు త్రిమూర్తులము గలిసి తగిన వ్రతమొకటి కల్పింతుము.

ఈశ్వ: అవశ్యమట్లే గావింతుము.

బ్రహ్మ: అతి శీఘ్రకాలముననే కర్తవ్య మాలోచింతుము.

విష్ణు: నారదా! నీవును మాకు సహాయభూతుడవై మా కార్యములయందు పాల్గొనవలయును సుమా!

నార: ధన్యోస్మి, ధన్యోస్మి. శ్రీ శ్రీ శ్రీ త్రినాధ స్వాముల సేవకుండనై వలయు కార్యముల యందప్రమత్తుడనై సంచరించెద. ఇంక నే బోయెద సెలవొసంగుడు.

విష్ణు: నారదా! ఇంక బొమ్ము.

నార: జాయ్! త్రినాథులకు జాయ్!

(తెర వ్రాలును)

★

సీరియల్ నాటిక

# భక్తిలీల

శ్రీ లాకె శ్రీనివాసరావు

రంగము ౩.

[ప్రదేశము : మధుసూదనుని కుటీరము.

ప్రవేశము : మధుసూదనుడు వాకిట నిలిచి]

మధు : శాంతం ! శాంతం !

శాంత : (ప్రవేసించి) ఏమీ ?— ఆ వేదీ ?—

మధు : ఆవు కనుపించుట లేదు. కట్టుద్రెంపి ఎచ్చటికో పోయినట్లున్నదే !

శాంత : కట్టుద్రెంపి పారిపోయినదా ?

మధు : ఔను. ఈ పూట దూడకూ మన పిల్లవానికి పాలు లేనట్లే తోచుచున్నది.

శాంత : ఈ ప్రాంతమున నెక్కడేని ఉండగలదు. మీరు పోయి వెతకి తీసుకొని రండు.

మధు : పోవుచున్నాను. (పోవును.)

శాంత : ఆహా ! దైవ సంఘటనము చాలా విచిత్రమైనది.

తే॥ గీ॥ దైవ ఘటనము దెలియగా। దరము గాదు
దైవమే గద జీవనా। ధార మిలను
జీవకోటుల సృజియించి। చిత్రలీల
జాతిలో గప్పకును తిండి। బ్రీతి నొసగు.

సర్వేశ్వరా ! నేడు మా పసిపాపను ఆవు దూడను ఆహారం లేకుండా జేయుదువా ! అట్లు జేయవు. నీవు దయామయుడవు. ఆవు త్వరలో దొరుకు నటుల జేయుదువు.

రామి : (ప్రవేసించి)—శాంతం !

శాంత : ఓహో ! రెడ్డిగారా ! దయచేయుడు.

[దర్భాసనము వేయ రామిరెడ్డి కూర్చొనును]

రెడ్డి : మధుసూదనముగారు లేరా ?

శాంత : మీరు పంపిన యావు కట్టువీడి పారి పోయినది. దానిని వెదకుటకు వెళ్లియున్నారు.

రెడ్డి : (తనలో) ఆహా ! మంచి యవకాశము నాకు లభించినది. ఆ యావు చాల పెంకిది. దాని యల్లరులను మేమే భరించలేనప్పుడు ఈ అమాయకపు బ్రాహ్మణులా భరించగలరు ! అది దొరకుట చాల దుర్లభము. నా కార్యమున కిదే యదును. (ప్రకాశముగా) ఆవు, దూడను విడిచి ఎక్కడకు పోగలదు, త్వరలో రాగలదు.

శాంత : ఆ యావునిచ్చి మా పిల్లవాని ప్రాణములను కాపాడితిరి. మీ మేలు మరువలేము.

రెడ్డి : చేసిన మేలు మరచిన వారెందరో గలరు. కాని, నీవు మాత్రమట్టు మేలు మరువవని నాకు తెలియును.

శాంత : నా జీవితకాలము మరువను. ప్రాణములనైన అర్పించుటకు వెనుదీయను.

రెడ్డి : ఏమి మేలు ! నీ పిల్లవానికి పాలకొరకు ఒక యావు నిచ్చినంత మాత్రమున మేలా ? ఇంకా యెన్నో !

శాంత : అది చాలదా ! చాలును బాబూ ! చాలును.

రెడ్డి : నిజముగా మీతో స్నేహముగలిగినది మొదలు మిమ్ము జూడకుండా నొక క్షణమైన నుండ జాలను—శాంతం ! నీవు మిక్కిలి ప్రేమ మానసవు. నూదంటు రాయివలె నన్నాకర్షించియున్నావు.

తే॥ గీ॥ వేద పారాయణము జేయు । విధముగాను
నీదు నామము నిత్యము । నే బఠింతు
నిన్ను జూడని నిముసము । నెన్నొ యుగము
అని దలంచెద నమ్ముమో । వనిత నిజము.

శాంత : మీకు మా యందనురాగము గలిగినందులకు ధన్యులము.

రెడ్డి : శాంతం ! ఈ అడవిలో, ఈ నిర్జనమైన ప్రదేశమందొక్కతివే వుండగలవా ?

శాంత : అన్నింటికి సర్వేశ్వరుడు లేడా ?

రెడ్డి : (నవ్వి) వెఱ్ఱి మొగమా ! ఏమి విశ్వాసము. సర్వేశ్వరుడు. అంత సత్యకాలమిది... నేను నీతో కొన్ని ముఖ్యమైన సంగతులు మాట్లాడ దలచు చున్నాను. ఏమందువు ?

శాంత : (తనలో) ఈతని యభిప్రాయమును జూడ నపాయము సూచించుచున్నది. అపాయమును దప్పించుకొను మార్గమాలోచింప వలసియున్నది. (యోజించి) సరే ! (ప్రకాశముగా) ఏమది ?

రెడ్డి : మగవారు ఆడువారితో ముచ్చటింపవలసిన విషయము లేముండును ?

తే॥ గీ॥ అందముగ నిండు యౌవ్వన । మందునున్న
యాడు దానిని ఏకాంత । మందు గూడి
ముచ్చ టించెడి ముఱిపెంపు । ముచ్చటులను
ప్రొద్దు బుచ్చగ నీయాజ్ఞ । బొందుచుంటి.

శాంత : ఆహా ! మిమ్మనవలసిన బని యేమున్నది. మీ మానసమును జేరచిన దేవునే నిందించ వలసియున్నది.

రెడ్డి : ఆ దేవుడు నా మానసమును జేరచెనో, మానెనో కాని నీ సుందర సుకుమార రూపమే నా హృదయమును జూరగొనుచున్నది. రేయిం బవళ్లు నిద్రాహారములు లేవు. నన్ను రక్షించి ప్రణయ భిక్షబెట్టుము.

తే॥ గీ॥ మోహనాకార మగు నీదు । మోము జూచి
మరలు నిలుపగ జాలను । త్వరగ నేలు
మధుర మొకసారి గ్రోలగా । నాన తిమ్ము
ముదముగా నొక్క ముద్దిమ్ము । ముద్దుగుమ్మ !

శాంత : ఏమేమీ శ్రీపురమను నొక పట్టణమున కధికారులు. ఎందరో ప్రజల కష్ట సుఖములను గమనించ వలసిన మీ యట్టి ప్రభువులే నీతిదప్పిన ప్రజల గతి ఏమి గావలెను ? ఇట్టి చేతలు చేయుట మీయట్టి వారికి ధర్మమేనా ?

రెడ్డి : శాంతం ! నా మనస్సు నీవు హరించి యున్నావు. అందువలన నా శరీరము, మనస్సు యెంత క్లేశ పడుచున్నవో ! నీవు దయగలదానవు. గనుక మనస్ఫూర్తిగా గ్రహించగలవు. కాన నన్ను కౌగలించుకొని నా తాపమును దీర్చకున్న నా ప్రాణములను నీ పాదముల సన్నిధిని విడిచిపెట్టెదను. నాకు ప్రాణదానము చేయుదువా మానుదువా ?

శాంత : మీరు నా తండ్రివంటి వారు. మా ప్రభువులు. పరసతులను ప్రేమించుట మహా పాపము. పాప పుణ్యములను పరమేశ్వరుడు సర్వదా జూచుచుండును. మీ యట్టి బుద్ధిమంతులే యిట్టి అక్రమ కార్యములను జేయ వచ్చునా ? ఇంకనైన పశ్చాత్తాపమును జెంది పాపచింతలను విడిచి పెట్టుడు.

రెడ్డి :—ఓహో నీతులనా నేర్పుచుంటివి ?

సీ॥ కనరాని పరమందు । గల సౌఖ్యముల గోరి
ఇహ సుఖంబులు వీడ । నే మనుదును
పూర్వ గాథల విని । పుణ్య పాపములని
యెంచి సౌఖ్యము వీడ । నే మనుగును,
యముడు గిముడటంచు । భ్రమసి నిజంబని
యెంచి సౌఖ్యము వీడ । నే మనుదును,
పుట్టెడాస వహించి । ముక్తి గిక్తి యటంచు
నెంచి సౌఖ్యము వీడ । నే మనుదును

తే॥ గీ॥ నీతు లెన్నెని కోటులు । నేర్పవచ్చు
గాని, చేతలు జేయుట । గష్టమగును
రతిని మించిన సౌఖ్య మీ । క్షితి తలమున
గలదె వగలాడి నీ వెఱుం । గనిదె చెపుమ !

నన్ను గరుణించుము : ఒక్క బాపనయ్య నీ ప్రేమనా తీర్చగలడు. కడుపునకు బట్టెడన్నమును బెట్టలేని వానితో నీవేమి గాపురమును చేయగలవు ?—నేను జమీందారుడను, అందము గలవాడను, కావలసినంత ధనముగలదు

—నీవు నన్ను చేపట్టినట్లయిన మహారాణివలె నుండ గలవు. ఆ బాపనయ్యతో నీ గాపురమున కేమి సుఖము?

శాంత : అయ్యా! పతి యెట్టివాడయినను సతికి దైవ సమానుడు. అక్రమపు మాటల నాడవలదు.

తే॥ గీ॥ సతికి పతిగాదె యిహపర । శాంతి యుతము
సతికి పతి సేవనమె గతి । సాధనమ్ము
పతిని నమ్మిన పడతియే । వెతలు లేని
సుమతి యని బుధులాడెడి । సూక్తి వినవె?

రెడ్డి : నా యట్టి జమీందారునే తిరస్కరించు చున్నావు. దూరమాలోచించుకొమ్ము నా యాజ్ఞ నెవ్వరూ ఉల్లంఘించలేరు. నేను తలపెట్టిన యెట్టి కార్యమును గాని సాధించగలనని తెలిసికొనుము.

శాంత : అయ్యా నేను నిస్సహాయముగ నుంటినని తలంచి మీ యిష్టమైన చేతలను జేయుదమన్న జడియు దానను గాను. నా కీ ప్రాణములతో సంబంధము లేదు. నా మాన మర్యాదలను గాపాడు కొనవలసిన దానను. భగవంతు డొకడున్నాడు. విద్యావంతులు గనుక నింత దూరము జెప్పితిని. ఇంక నిచ్చటినుండి వెడలిపొండు.

రెడ్డి : నీకు చెప్పవలసినంత దూరము జెప్పితిని. బ్రతిమాలవలసినంతవరకు బ్రతిమాలితిని. నిన్ను బలత్కారము జేసిన యిక్కడ నీకు దిక్కెవ్వడు?

శాంత : ఏమీ! నాకు దిక్కా!—దిక్కా!—దిక్కా?— ప్రహ్లాదాది భక్తుల గాపాడిన వాడు—ఆ సర్వేశ్వరుడు లేడా? లేడా?— దేవుడు లేడా?—దేవుడు— దేవుడు— లేడా దేవుడు?

రెడ్డి : లేడు.

శాంత : కనుగొనలేడా?

రెడ్డి : స్వరూపమే లేనివాడు కన్నులతో నెట్లు గాంచును?

శాంత : పాపముల చెందలేడా?

రెడ్డి : పాప పుణ్య విచక్షణమే యుండిన సముద్రమందు ప్రయాణము జేయుచున్న నావ మునుగు చున్నప్పుడు అందలి జనులందరు మునిగి చత్తురు. అందు పాపాత్ములు పుణ్యాత్ములు లేరా? భూకంపము గలుగు నప్పుడు కొంత ప్రదేశము పాప పుణ్యాత్ములతో నశించుటలేదా?

శాంత : బ్రోవన్ లేడా?

రెడ్డి : కొన్ని నాళ్లాహార పానములు విడిచితివేని జచ్చెదవు. అప్పుడు దేవుడెట్లు బ్రోవన్ గలడో తెలిసికొన గలవు.

శాంత : దీన దయాళుడు లేడా?

రెడ్డి : ప్రపంచమున సురూపుల కురూపుల—శక్తి వంతుల శక్తిహీనుల—ధనవంతుల ధనహీనుల సృష్టించు వాడైన దయాళుత్వ మెట్లుండును?

శాంత : జగమేలు వాడు లేడా?—లేడా?

రెడ్డి : (నవ్వి) సర్వ నూన్యుడా జగమును భరించుట కల్ల. కల్ల.

శాంత : కం॥ లేడా దేవుడు? కనుగొన
లేడా? పాపముల జెంద । లేడా? బ్రోవన్
లేడా? దీన దయాళుడు
లేడా? జగమేలు వాడు । లేడా? లేడా?

రెడ్డి : ఆ॥ వె॥ లేడు! లేడు! లేడు! లేడుగా దేవుడు
దేవుడున్న యపుడు । జీవులెల్ల
ఒక్క తీరు గాను । ఒక్క రీతిగ నుండి
వరలు చుండ వలదె । వసుధలోన.

శాంత : ఆహా! మీయట్టి నాస్తికులు అనుభవించునప్పుడే దైవతత్వమును దెలిసికొన గలరు.

రెడ్డి : ఏమి నీతులు?—ఇదిగో నీ దేవుడు—ఈ భూమిలో దేవుడు—దేవుడున్నాడు చూడు—వీడే నీ దే-వు-డు (బలాత్కారము జేయ బ్రయత్నించును.)

శాంత : హా! జగన్నాధా! ఈ అనాధను రక్షింపవా! (కుటీరమునుండి వెలుపటకు పరుగిడుచుండ రెడ్డి వెన్నాడి)

రెడ్డి : వీడే నీ నాధుడు, శాంతా! నిలు నిలు.

శాంత : (కర్తవ్య మూహించి—ఆశ్చర్య మభినయించి) ఆహా! దేవుడిటు వచ్చుచున్నాడు. రెడ్డీ! అదుగో అదుగో దేవుడు, చూడుము. రెడ్డీ! అట్లబ్బుర పోయెద వేమి?—చూడుము, కనుపించెనా? (రెడ్డి గడగడ వణకుచు అబ్బురమున నొక దిశను జూచుచుండ శాంత తప్పించుకొని పొదలలో దాగుటకు పరుగునబోయెను.)

రెడ్డి : ఏడీ! దేవుడు?—దేవుడు లేడు గీవుడు లేడు. శాంతం! బలే టక్కరివి. ఈ కలికాలమున దేవుడు గలడా?—(తిరిగిచూచి) ఏదీ శాంతం? ఏదీ! ఏదీ?— ఆహా! శాంతా! ఎంత మోసము చేసితివి? ఎటు బోయితివి?—సరే, ఎట్లు దప్పించుకొనియెదవో చూచెద. నిన్నే వెతకి పట్టుకొన లేకుందునా? (పోవును.)

(తెరవాలును.)

★

సీరియల్ నాటిక

# భక్తి లీల

శ్రీ లాకిరెడ్డి శ్రీనివాసరావు

## రంగము ౪.

[ప్రదేశము : వైకుంఠము.

ప్రవేశము : త్రిమూర్తులు ఇష్టాగోష్ఠి సలుపుచుందురు]

విష్ణు : శివ, విధాతలారా! మన కల్పిత త్రినాథ వ్రతమును రమా వాణీ భవాను లమితానందమున సలుప సామగ్రిని సమకూర్చుచున్నారు.

ఈశ్వ : స్త్రీలకు వ్రతములం దభిమానము మెండు.

బ్రహ్మ : అందీవ్రతమున నవీనత్వము గలదు. నూతన పోకడలతో సూక్ష్మముగాజేయ వీలగును. కాన లక్ష్మి పార్వతీ సరస్వతులు శీఘ్రముగా నాచరించుట కాతురపడుచున్నారు.

నార : (ప్రవేశించి) ఓ త్రిమూర్తులారా! త్రినాథులారా!

విష్ణు : ఏమి నారదా! ఏల నీ యాతురము?

నార : వీక్షించితిరా! వీక్షింపుడు—వీక్షింపుడు. దివ్య దృష్టిని వీక్షింపుడు. భూలోకమున ఆ మధుసూదనుని భార్య శాంతాదేవి గతి ఎట్లున్నదో వీక్షింపుడు. ఆ మదోన్మత్తుడగు రెడ్డి ఎట్టి దుండగముల జేయ సమకట్టి యున్నాడో గమనింపుడు. ఆహా! ఆహా! ఆ పతివ్రతామతల్లి కెట్టి అపాయ మాపాదించినది. ఆ యార్తనాదమును వినుడు—ఆ యార్తారవము విన వచ్చుచున్నదా? లెండు—కాపాడుడు. ఓ విష్ణు దేవా! కర్తవ్య మేమి. ఓ బ్రహ్మ దేవా! ఉపేక్షింపకుము. ఓ మహాదేవా! రక్షింపుము, రక్షింపుము.

(త్రినాథులు ఆతురమున పోవుదురు)

నార : ఆహా! భక్తి మహాత్మ్యము కేమనవచ్చును!

తే॥ గీ॥ మకరి నోటను జిక్కిన। మద గజమును
గావ నారాయణుడు బోవు। కరణి నిపుడు
హరియు, హరివెంట హరుడును, । హరుని వెంట
ధాతయును పోవుచున్నారు। యాతురమున.

ఆహా! ఆహా!

బ్రహ్మ విష్ణు మహేశులు భక్తవశులు.

భక్తిత్రాళ్ళచేవారల బంధనమునుజేసి ముక్తిగాంచనగును.

శ్రీ త్రినాథ వర మహాత్మ్యము నెరుగగా వశము గాదు. అట్టి భక్తవశంగతులగు శ్రీ త్రినాథులను గద్య పద్య గేయంబుల సంకీర్తన మెంత జేసినను తనివి దీరునా!

(ప్రవేశము త్రినాథులు)

విష్ణు :—బిడ్డా! నారదా! మేము వ్యాఘ్ర రూపముల జని ఆ దుర్మార్గుని, ఆ మదోన్మత్తుని వెన్నాడి పారద్రోలి ఆ దీనురాలిని రక్షించినారము. ఆ మహా సాధ్వి కెట్టి మానభంగమును గలుగలేదు—దివ్య దృష్టిని గాంచుము.

సీ॥ తిలకించు మాదెస। దివ్య దృష్టిని వేస
నా పతివ్రత కెట్టి। హాని లేదు
మూడు దెబ్బలులుగా। ముప్పురు మూర్తుల
మరిగి యా దుర్మార్గు। నచటి [illegible]

## భక్తిలీల

పాత్రోలియము మాన। బంగమా సాధ్వికి
గలుగనీక కరుణ। గావినాము
తన కుటీరమునందు। దన పిల్ల వానితో
దనియుచు నున్నదా। తల్లి హాయి!

తే॥ గీ॥ నీతి సత్యము మానస నిర్మలమ్ము
గాంచు భక్తుల గాపాడ। గంకణమ్ము
గట్టుకొని లోకముల నేలు। త్రిమూర్తి
త్రయము సెనుగవె, నారదా!। ధన్య లీల!

నార: (దివ్య దృష్టిని దిలకించి) ఆయమ కుటీరములో దన పిల్లని బాలు గుడుపుచు సురక్షితముగా నున్నది. ఆహా! మిమ్ము నమ్మిన వారికేమి కొరత గలుగును.

విష్ణు: నారదా! నీవు కోరియున్న రీతిగా త్రినాథవ్రతమను నొక వింత వ్రతము గల్పించి నారము. దాని నిప్పుడే త్రిదేవు లాచరించుచున్నారు. నీవు వాయి విధానమును దెలిసికొని త్వరగ భూలోకమున కరిగి ఆవును వెదకుచున్న మధుసూదనున కుపదేశింపుము. పిదప మా మహాత్మ్యమును జూపెట్టుదుము.

నార: ధన్యోస్మి, ధన్యోస్మి.

(తెర వ్రాలును)

## శ్రీమతి సరోజినీదేవి

సీ॥ స్వారాజ్య స్వాతంత్ర్య సంసిద్ధికై తన్వు
ధార బోసిన యట్టి ధన్య చరిత
స్వార్థంబు త్యజియించి సౌఖ్యంబు వీడి ప్ర
జా సేవజేసిన సదయ హృదయ
పరదేశ పరభాష పరసంప్రదాయముల్
వీడ గల్గినయట్టి విమల చరిత
మాత కస్తూరికి నూతయై దగనిల్చి
ప్రియము బల్కినయట్టి నయగుణాఢ్య

గీ॥ సాధుగుణశీల స్వాతంత్ర్య సమరధీర
అమరగాయని శాంత రమా లలామ
దివికి జేరె సరోజిని దేవి యౌర
మరపు రాదెన్నటికి నిల మరువ గలమె.

గీ॥ మహిత గుణాయుత భారత దుహిత యౌర
భారతావనీ భావి సౌభాగ్యమునకు
మూల మైనట్టి స్వాతంత్ర్యమును వహించి
కృషియొనర్చిన సాధ్వి సత్కీర్తి దనరె॥

శ్రీమతి గిడుగు లక్ష్మీకాంతమ్మగారు

చరిత్రపుటలో చెఱిగిపోని చిరంజీవి

## ఫ్లారెన్సు నైటింగేలు

✻ శ్రీ జంపాల ఉమామహేశ్వరరావుగారు ✻

శోకాతుల లోకంలో
దివ్యోజ్జ్వల దీపికలో
చీకట్లను చీల్చుకొంచు
శోకాలను పోకార్చుతు
సంక్రాంతులు సవరిస్తో
పయనించిందా తేజోపుంజం.
తిమిరావృత కుడ్యంపై
ఫ్లారెన్సు ప్రసరించిన
దివిదివ్య జ్యోతిర్ద్యుతి
భవికోన్నత ఛాయల్లో
బాధార్తుల వ్యథాహృదుల
నుదయించును మధుమరీచి.

గత చరిత్ర గవాక్షాల
తొంగి చూచు ఫ్లారెన్సు
సదమల జీవితశిల్పం
మేదినికొక మహిమోజ్జ్వల
రోచిస్సును సూచిస్తూ
భాసించును భవిత చరిత పంక్తుల్లో
కరుణాయుత క్రమజ్యోతి
కేలదాల్చి నిల్చిన ఫ్లారెన్సు
త్యాగోజ్జ్వల మహిమా మండిత
మహిళా లోకానికి మేలుబంతియై
విశ్వచరిత వీణాగళమున
వినిపించును యుగయుగాల.

★

(కిల్వర్ కోచే ఆధారంగా)

సీరియల్ నాటిక

# భక్తలీల

శ్రీ లంకా శ్రీనివాసరావు

రంగము ౬.

[ప్రదేశము : మార్గ మధ్యము ; నటవృక్ష పునీకలో.

ప్రవేశము : ఆచార్యుడు.]

ఆచార్యుడు : ఆచార్యుల వారన్న శ్రీపురంలో ప్రజలు ఎంత భయభక్తులతో నుంటారు. రెడ్డిగారిక్కూ సైతం హడలు. కాని, మాయావిడ దగ్గరమాత్రం నాకు హడలు. రెండో వివాహం చేసుకొన్న నాలాంటి ముసలిముండా వాళ్ల గతి యింతే. యౌవనపు భార్యలు ముసలి మగలను లక్ష్యపెడతారా! హెచ్చూ తగ్గూ చూస్తారా! మా యావిడ నాచే సంతలో సామగ్రిని కొనిపించి చాకలి మూటలుమోయు గాడిదవలె యీ మూటలు మోయి స్తున్నది. అలా చెయకపోతే యీ కాస్తబుట్టూ పీకి పెడుతుంది. ఎముకలు విరిచిపోగొడ్తుంది. ఏం చేయను.—అబ్బా! ఈ మూటలు భారంవల్ల మూపు వాచి బొబ్బలెక్కినవి. ఈ చెట్టు నీడలో కొంచెం కొంచెం ఆయాసము తీర్చుకొని పోతాను. (చెట్టు నీడను కూర్చొని) ముసలిముండా ప్రాణం గనక చిరు తిండ్లపై మనస్సు పరుగెట్టుంది. ఈ చిరుతిళ్లు సంతలో కొన్నా! కొంచెం తిని ఆకలి తీర్చుకుంటా! (భుజిస్తూ అచ్చటికి వచ్చుచున్న నారదుని చూచి) వీడి తస్సా గొయ్యా! ఎవడురా వీడు? నారదునిలా వేషం గీషం వేసుకొని యీకాస్తా తినేటానికి యిటు వస్తూన్నాడు. త్వరగా తినేయాలి (తొందర తొందరగా తినుచుండ నారదుడు ప్రవేశించును).

నారద : భక్తుడా! నాకవసరము లేదులే! త్వరపడుచున్నా వెందులకు?

ఆచా : దయచేయండి స్వామీ! చూడగా మీరు నారదుడులా కనిపిస్తున్నారు. పరమభాగవతుల్లా నున్నారు.

నార : నాకంతటి ముఖస్తుతిజేయ నవసరములేదు.

ఆచా : స్వామీ! మీవంటి సిద్ధపురుషులకు తెలియని వేముండును?—దయ తలంచి స్వర్గసుఖం పొందటానికి ఏదేని మార్గముపదేశించాలి.

నార : అట్లయిన, ఒక వ్రత ముపదేశించెదను. దాని నాచరించువారు తరింతురు.

మధుసూదనుడు : (ప్రవేసించి) మహాత్ములారా! నమస్కారములు.

నార : శుభమస్తు.

ఆచా : పుత్రపౌత్రాభివృద్ధిరస్తు.—మధుసూదనుడా?—

మధు : ఔను, శ్రీ పురాచార్యులుగారూ!—ఈ మార్గముననొక యావుపోవుట గాంచితిరా?

ఆచా : లేదు మధుసూదనా!

మధు : ఇచ్చటకు సంత ఎంతదూర ముండగలదు?

ఆచా : ఇదిగో! ఈ సమీపాన్నే ఉంది.

మధు: స్వాములు తెలిసికొనగలరు. నా యావు పలాయన మైనది. సంతతము వెదకుటకు పోయెదను.

నార: ఓహో! సంతసించుచుంటివా? నాకొక చిన్న మేలు చేసితివేని నీయావు లభించుటకు తగిన మార్గముం జెప్పెదను.

మధు: ఆర్యా! చెప్పుడు శిరసా వహించెదను.

నార: ఒకకాని తమలపాకులు, ఒకకాని సాంబ్రాణి, ఒక కాని నూనెను తెచ్చియిత్తువా?

మధు: స్వామీ! నాచేత నొకకాసైనలేదు. ఇవి యెట్లు దెచ్చి యీయగలను?

ఆచా: ఇవిగో! ఈ మూడుకానులు తీసుక వెళ్లు (మూడు కానులిచ్చును).

మధు: స్వామీ! నాయావు జిక్కెడి మార్గమును తెలిపియుంటిరి.

నార: సామగ్రిని గొనితెమ్ము. పిమ్మట కర్తవ్య మెరిగింగించెదను.

మధు: చిత్తము. (నిష్క్రమించును)

ఆచా: స్వామీ! మీరు విష్ణు భక్తులా! శివభక్తులా?

నార: నేను బ్రహ్మ విష్ణు మహేశ్వరులను త్రినాదుల భక్తుడను.

ఆచా: దేవుడొక్కడేగదా! ముగ్గురనెందుకు పూజిస్తున్నారు?

నార: ఆచార్యా! మనము దేవుని అనేక నామములతోను, అనేక మూర్తులుగాను, అనేక విధంబులను పూజించుచున్నాము. ఏరూపంబున పూజించినను దేవుడు సంతోషమును జెందును.

ఆచా: అయితే యీ ముగ్గురిలో గొప్పవారెవరు?

నార: ఎవరికి వారే. ఒకరు ఎక్కువ ఒకరు తక్కువ అను విచారణ సలుపరాదు.

ఆచా: నాకుమాత్రం ఓ సందేహం ఉంది. నేను విష్ణు మతస్థుడనైనప్పటికి శివునియందే అభిమానం ఉంది.

నార: "పొరుగింటి పుల్లకూర రుచి" యన్నట్లు కొందరు తమ తమ మతమునందుగల సత్యాసత్యము తెలుగక అన్యమతము నపేక్షించుచుందురు.

ఆచా: అన్యాయంలోనే రుచుంది స్వామీ!

నార: (పరిహాసముగా) అన్యాయమునందు రుచి గలుగునప్పు డుండవచ్చునేమో!

ఆచా: నేను మా మతస్థుల కండ్లు కప్పటానికే యీ నామాలూ గీమాలూ ధరిస్తూన్నది. కాని శివుడే గొప్పవాడు. ఎందేతా అంటే రాతి విగ్రహాలు మనుష్యులు చేయటం నేర్చుకొన్నాక విష్ణుమతం వచ్చింది. లేకుంటే బోడిరాళ్లే అన్ని దేవాలయాలలో నుండవలసిందే! శివుడు పురాతన దేవుడు. అందుకే లింగాకారాన్ని పూజిస్తారు. శంకరాచార్యుడు, మధ్వాచార్యుడు, రామానుజులూ మొదలైనవాళ్లు ఏవో మసిబూసి యిలా చేశారు. ఈ విష్ణువుని మీదికి తెచ్చారు.

నార: ఆచార్యా! మనము వాదప్రతివాదములతో దర్కించి కాలమును వ్యర్థముజేయక దేవుని భజించవలెను. దేవునికి భక్తియే ప్రధాన వస్తువు.

ఉ॥ కాలము వమ్ముసేయక, చి
కాకు మనంబున బాసి, వాదిన
ల్మేలని వీడి, సంతత మ
మేయ ప్రభాకరుడై వెలుంగు శ్రీ
లాలను డైన దేవు నెడ
లాలిత భక్తి లయింప జేసి, యే
లీల భజించినన్ సుఖ ను
లీలల మోక్షము చేయి జిక్కదే!

మధు: (ప్రవేసించి) స్వామీ! ఇవిగో మీరు కోరిన వస్తువుల దెచ్చియున్నాను. (సామగ్రిని నారదున కొసంగును)

నార: సూక్ష్మమున మోక్షమును బొందుటకును, మిక్కిలి పేదవారు నైతేము భగవంతు నర్చించి సకల సుఖములు పొందుటకును, ధనధాన్యాది భాగ్య భోగంబుల దుల దూగుటకును, మీకొక క్రొత్త వ్రతమును ఉపదేశించు

చున్నాడను. అదియే శ్రీ త్రినాథవ్రతము. దాని నాచరించి ముముక్షువులు గందు.

మధు : స్వామీ! ఈ వ్రతమే పర్వదినమున జేయవలెను?

నార : దేవుని భక్తితో గొలుచుటకు తిథి వార నక్షత్రములు గావలయునా? ప్రాణములు పోవుచున్న రోగికి ముహూర్తమును నిర్ణయించి యౌషధముల నొసంగుదురా?

ఆచా . అయితే యీ వ్రతాన్ని ఎప్పుడుబడితే అప్పుడే చేయవచ్చునా?

నార : ఔను, ఈ తక్షణమే జేయుదము.

ఆచా : కడుపునిండా భుజించియేనా? ఉపవాసం చేయొద్దా?

నార : అవసరములేదు. ఆకలి దప్పులతో మనస్సును నిశ్చలముగా నిలుపుట కష్టము. కావున ఉపవాసములతో బనిలేదు. నిశ్చలమైన మనస్సే యీ వ్రతమును జేయుటకు ప్రధానము.

ఆచా : నివేదనకు పదార్థము?

నార : ఏమియూ నవసరము లేదు. కలిగినవారు తమ యిచ్ఛానుసారముగా నర్పించవచ్చును. కానీ ప్రసాదము కొరకు తగవులాడరాదు. ఎవరికెంత లభించినదని జగడమాడరాదు. ఎవరికెంత లభించిన నంతే భాగ్యమని తలంచవలెను.

ఆచా : సరే, ఈ వ్రతం చేయటానికి ఎంత పైక మవసరముంటుంది?

నార : ఈ వ్రతము జేయుటకు మూడుకానుల సామానులు మాత్రము చాలును.

సీ॥ నిర్మలమైనట్టి । నిశ్చల మానస
ధాములై త్రైనాథ । స్వాములకును
ఒక కాని సాంబ్రాణి । ఒక కాని నూనెను
వక్కలాకుల కొర । కొక్క కాని
సమకూర్చి తెచ్చిన । సామగ్రి సమముగా
మూడువంతులు వేసి । ముమ్మూరకును
యర్పించి భక్తితో । నర్పించు వారలు
మోక్షము వేగమే । పొందగలరు.

తే॥ గీ॥ తిథియును, వారము నక్షత్ర । విధియులేదు
ఉపవసింపగ బనిలేదు । యుర్విలోన
నెవ్వరైనను నీవ్రతి । మెచ్చమైన
నాచరింపగ జెల్లునో । యార్యులార ।

మధు : గురుసత్తమా! ఇది వింత వ్రతముగా నున్నదే! త్రినాథులను బూజించుటకు మనస్సు వేగిరపడుచున్నది. వ్రతమును జేయింపుడు.

నార : అట్లయిన, బ్రహ్మ విష్ణు మహేశ్వరులను ప్రతిష్ఠింపుడు. వక్కలాకులను త్రిమూర్తులకు సమముగా బంచి పెట్టుడు. నూనెను మూడు ప్రమిదలందు బోసి ముమ్మూర్తులకు దీపముల నర్పించుడు. సాంబ్రాణి ధూపమును త్రినాథులకు సమముగా సమర్పించుడు.

(మధుసూదనుడును, ఆచార్యుడును నట్లు జేయుదురు) ఇంక మీ మానసముల నిశ్చలముజేసి ధ్యానింపుడు.

(నారదుండొక్కొక్క చరణము బాడుచుండ పిమ్మట మధుసూదనాచార్యు లిరువురు బాడుచుందురు)

జాయ్! త్రైనాథులకును
జాయ్! త్రిలోక వందితులకు
జాయ్! త్రిలోక పాలురకు
నమో! నమో!! నమో!!!

(అందరు భజించుచుండ పూజామంటపమందు త్రిమూర్తుల చిహ్నములుగా రాతి విగ్రహములును, ఒక రత్నహారమును బుట్టును.)

నార : (ధ్యానానంతరమున)—ఆహా! ఆహా! వీక్షించితిరా! శ్రీ త్రినాథుల మహిమా విశేషంబున నీ వ్రత మంటపమందు బ్రహ్మ విష్ణు మహేశ్వరులను శ్రీ త్రినాథుల రాతి విగ్రహము లుద్భవించినవి. ఎట్టి మహత్తు! ఆహా! చూచితిరా! ఒక రత్నహారంబున్నూ యిందు బుట్టినది. ఇట్టి వ్రతము జేసినవారికి రత్నరాసుల కేమి కొరత?

ఆచా : ఓహో! ఓహో! చాలా అద్భుతంగా నుందే!

మధు : ఆహా! ఏమి మహత్తు! అద్భుత సంఘటనము!

నారా: ఆచార్యవర్యా! ఈ పత్ర్య హోమము చేసి పంపుకొనగలరు?

ఆచా: మధుసూదనుడుగారికి పనిలేక్కి లేదండీ! వారు స్వీకరించరు.

మధు: మహర్షీ! నాకాపత్నహోమ మవసరము లేదు. త్రిమూర్తుల విగ్రహములు నాకా రాతివిగ్రహములే కొలుచుకుందును. వానినే నిత్యమారాధించి పూజా పురస్కారములతో భక్తి నిలుపుకొందును.

నారా: మధుసూదనా! నీవు పత్నహోమమును స్వీకరింపకున్నాడవు. మిక్కిలి యదృష్టహీనుడవు. నీ వెన్ని నాళ్లు భజించినను, ఎన్ని వ్రతములు చేసినను ఇట్టి రత్నహారములను బడయజాలవు. వీనిని నీకొరకే రత్నములను మా యిరువురము ఇత్తునా?

ఆచా: అవసరములేనివాని కెందుకండీ ఒలవంతంగా కట్టబెడతారు? పెట్టికివేస్తే దాని అందమంతా పాడౌతుంది.

మధు: దేవా! నాకేమియు నవసరములేదు. ఈ విగ్రహములనే పూజించుకొనెదను. అదియే పరమ సంతోషము. నాకు ధనమేల? ధనము పెరిగిన మదము పెరుగును. మదమువలన మాత్సర్యము—ఇట్లే కామ క్రోధాది లోభ మోహములు పెరిగి దైవచింతనని ధ్యానమున కాటంకము గలిగించును.

నారా: నీవు పరమభక్తుడవు, పరమభాగవతుడవు. నీయావు నీ కుటీరము కడకు బోవుచున్నది. నీ భార్యాబిడ్డలు సుఖంబున నున్నవారు. శీఘ్రముగ బొమ్ము. ఇవిగో! శ్రీ శ్రీ శ్రీ బ్రహ్మ విష్ణు మహేశ్వరుల చిహ్నములను రాతి విగ్రహముల దీసికొని బొమ్ము. (విగ్రహములను మధుసూదనుని శిరమునందుంచి) ఇవి మఱ్ఱిక్రింద ప్రతిష్ఠించియుండెను. కాన, నీ కుటీరము చెంత నొక మఱ్ఱి వృక్షముక్రింద ప్రతిష్ఠించి పూజించుచుండుము. నీ జన్మ సఫలము గాంచినది. నీవింకిజనుము.

మధు: ధన్యోస్మి! ధన్యోస్మి!—దేవా!

చం॥ కొలిచెద శ్రీ త్రినాథులను
కోరి వ్రతంబుల జేయుచుండెదన్
బలమగు పాపము ల్విడువ
భక్తిని మానస పూజ గూర్చెదన్
తెలిసె మహాత్మ్య మింతగను
తెల్పిన నారదు కాలమెల్లను
ఫలము లెరింపవిజన్మ పరి
పక్వము నొంది తరింప బూనెదన్.

(పోవును)

నార: ఆచార్యా! ఈరత్నహారమును గైకొమ్ము. నీవు భక్తితో వ్రతము నాచరించుచు మీ పట్టణ ప్రజల కుప దేశించి వారిచే వ్రతముల జేయించి వారందరు ధన ధాన్యాది భాగ్యభోగములందు నటులజేయుము. పొమ్ము (రత్నహారమొసగ నాచార్యుడు గైకొనును).

ఆచా: మహానందము—(పోవునూ తనలో) ఆ!—ఈ వ్రతాన్ని ప్రజల కుపదేశించాలీ! వాళ్లంతా ధనవంతులై నన్ను గౌరవిస్తారా? ఎవరికీ చెప్పక మాయావిడచే జేయించి భాగ్యభోగాలతో సుఖంగా గడుపుదును! ఈ రత్నహారం నూపెట్టి మాయావిన్నీ కనకంలా నా వెంట త్రిప్పుదును! (నిష్క్రమించును).

నార: ఈ కథావిధానమెట్లు పరిణమించునో తిలకించవలసి యున్నది. (నిష్క్రమించును.)

(తెర వ్రాలును)

సశేషము

★



సీరియల్ నాటిక

# భక్తిలీల

శ్రీ లా.కి. శ్రీనివాసరావు

[ప్రదేశము : మార్గము. ప్రవేశము : మధుసూదనుడు విగ్రహములతో]

మధు : కం॥ లభియించెన్ త్రైనాథుల
శుభ మూర్తులు నాదు చిత్త । మానంబులచె
విభవంబు మీర సతతము
నభిషేకము జేసి మదిని । యానందింతున్.

గాండ్లవాడు : (ప్రవేశించి) స్వామీ! రక్షించండి! రక్షించండి! నా నేరాన్ని క్షమించండి!

మధు : ఏమి నేరమును జేసితివి?

గాండ్ల : బాబూ! తమరు భక్తులని మహాత్ములని తెలియక తమదగ్గర కానీ తీసుకొని గిద్ద తిరుగ వేసి నూనెను తప్పు కొలత కొలిచి యిచ్చాను.

మధు : అయిన నేమందువు? ఆ తైలము స్వాములవారికి దీపారాధన జరిగినదే.

గాండ్ల : (వణుకుచున్న చేయిని జూపి) అప్పటినుంచి యీచెయ్యి యిలా వణుకుతూ నొప్పి పెట్టుతుంది. ఈ చెయ్యితో ఏకార్యమూ చేయలేను.—అబ్బా! బాధ! బాధ! రక్షించండి! రక్షించండి!

మధు : ఓయీ! నీవు అన్యాయము జేసితివి. ఇకముందెట్టి అన్యాయము జేయనని శపథముజేసి శ్రీ త్రినాథ స్వాముల వ్రతము జేయుదునని మ్రొక్కి వారి వ్రతమును జేయుము. నీచేయి బాగుపడి ధన ధాన్యాది భాగ్య భోగములతో దులదూగి మోక్షమును బొందెదవు.

గాండ్ల : స్వామీ! శ్రీ స్వాముల వారికే గాక ఎవరికైనా అన్యాయముగా తప్పు కొలతలు కొలిచి నూనెను అమ్మను. మరి న్నియమితమైన లాభంతో న్యాయమైన వర్తకం చేస్తాను. అన్యాయపు వర్తకం యింకా చేయనని స్వాములవారి ఎదుట ప్రమాణం చేస్తూన్నాను. తప్పక శ్రీ త్రినాథులవారి వ్రతాలు మూడింటిని చేస్తాను. (మ్రొక్కగా భాధతగ్గి చేయి బాగుపడును) ఆహా! ఆహా! ఎట్టి మహత్తు! నాచెయ్యినొప్పి వదలి బాగుపడింది. జాయ్! త్రినాథస్వాముల వారికి జాయ్!

మూడు మూర్తులు । మూడు రంగులు
మూడు గుణములు దాల్చినా—ఓ!—
ము మ్మూర్తు లారా!
మోక్ష మిచ్చి నన్ను గావండీ!
ముక్తి నొసగీ నన్ను గావండీ!

గురువర్యా! నమస్కారము. నేను తరించడానికి మార్గం ఉపదేశించారు. ధన్యుణ్ణి! ధన్యుణ్ణి!

మధు : బిడ్డా! ఇంటికి బోయి మీ వధూవరులు నా కుటీరమునకు రండు. వ్రతవిధానముం దెలియజేసి వ్రతమును జేయింతును.

గాండ్ల : చిత్తము, స్వామీ! అలాగే వచ్చెదము.

మధు : ఇంక బొమ్ము. (నిష్క్రమింతురు)

(తెర వ్రాలును)

## ఎనిమిదవ రంగము.

[ప్రదేశము : మధుసూదనుని కుటీరము కడనున్న వటవృక్షము. ప్రవేశము : మధుసూదనుడు విగ్రహములతో నా మఱ్ఱిక్రింద నిలచును]

మధు :—

తే॥ గీ॥ సర్వమును నిల్ప బెంపగ । సంహరింప
మూడు గుణములు దాలిచి । వేడు కలర
మూడు రూపుల వెలయుచు । మ్మూర్తులార!
మిమ్ము బూజించు నట్టి భాగ్య । మ్ముకలిగె.

శాంత : (ప్రవేసించి ఆతురతతో) ఈ ప్రతిమలెక్కడివి?

మధు : అవును వెదుక బోవు చుండ త్రోవలో నొక మహాపురుషుడు శ్రీ త్రినాధస్వాముల వారి వ్రతంబు జేయించెను. ఆ వ్రత మంటప మందవతరించిన త్రిమూర్తులు, బ్రహ్మ విష్ణు మహేశ్వరులు. వీరిని మఱ్ఱి నీడనే ప్రతిష్ఠింపుడని ఆ మహాభాగుడు సెలవిచ్చె.

శాంత : ఆహా! ఆహా! ఏమి నాభాగ్యము. శ్రీ త్రినాధుల సేవా ఫలము లభించునది. (విగ్రహముల ప్రతిష్ఠించుటకు స్థలమును శుభ్రపరచి మధుసూదనుని శిరమునుండి విగ్రహములను దించి ప్రతిష్ఠించును) తండ్రులారా! మమ్ము రక్షింప నేతెంచితిరా! మిమ్మి మఱ్ఱి నీడనే ప్రతిష్ఠించుచున్నాను. దయగనుడు.

మధు : శాంతా! శీఘ్రముగ స్వాముల కాతిథ్యముగొని రమ్ము (శాంత పోవును) ఆహా! ఏమి నాభాగ్యము.

తే॥ గీ॥ పూచె పుణ్యము, చక్కగా । గాచె తపము,
పండె భాగ్యము, నా మది । నిండె శాంతి,
జన్మ తరియించె మీదు భ । జనము దొరకె
కరము మోడిచి ధ్యానింతు । కరుణ గనుడు.

శాంత : (ఆతిథ్యముతో ప్రవేసించి) స్వాములారా! నా యాతిథ్యమును స్వీకరింపుడు. తండ్రులారా! ఆకలి గొనియున్నారు. ఈ ఫలముల నారగింపుడు. ఈ స్వర్ణ భద్రా నదీ జలముల ద్రావి దాహశాంతిని బొందుడు. ఈపువ్వములే అలంకారములు. అలసితిరి, వీవనతో విసరెద. ఎండ బడలిక దీర్చుకొనుడు. ఆహా! నేను నిరుపేదను. మీకేమి యాతిథ్యము నీయగలను? దయామయులారా! (ధ్యానించును. మధుసూదనుడును ధ్యానించును)

ఆ॥ వె॥ నాదు తండ్రులార! । నాదు దేవత లారా!
ఏమి యీయ జాల । నేను పేద,
నాదు చేతు లెత్తి । నా మనంబు నిలిపి
తృటియె ధ్యాన మిడుదు । తృప్తి గనుడు.

(అనంతరము భర్తతో) స్వాముల ప్రసాదమును దీసికొనుడు (ఈయగా)

మధు : పరమ భాగ్యము. (అంగికొనును. పిమ్మట నా దంపతులు ప్రసాదమును భుజించు చుం ఆప్రాంతమున ఆవు "అంబా! అంబా!" యని అరచుచుండ నాశ్చర్యముగా) శాంతం! శాంతం! అదుగో! అదుగో! మనయావు అరచుచు నిటే వచ్చుచున్నది.

శాంత : ఆనంద మానందము. మనయావు తనంతట తానె వచ్చుట శ్రీ స్వాముల వారి అపారకరుణా కటాక్షము చేతనే గదా! (ఆవు అంబాయని యరచుచుండ) దా! దా! అంబా! దా! (భర్తతో) ఆవును గట్టి పాలను దీసి స్వాముల కర్పింతము రండు. (నిష్క్రమింతురు)

(తెర వ్రాలును.)

## తొమ్మిదవ రంగము.

[ప్రదేశము : శ్రీపురమందలి ఆచార్యుని గృహము.

ప్రవేశము : ఆచార్యుడు విచారమున.]

ఆచార్యుడు : ప్రతిమనిషీ మధుసూదనుడి దగ్గరకే పోతే నావద్దకు వచ్చేవాడెవడు? శ్రీపురానికి ఆచార్యుల వారని ఒకడికేనా భయభక్తులు లేవే! అంతా వాడి కుటీరానికే పోయి ఆ పాడు ముండా వాణ్ణే గౌరవిస్తున్నారే! నాకేసి ఒకరూ చూడరే! అంచాత నాకు చాలా అవమానం కలుగుతూంది. ఏదో ఓ పన్నాగం పన్నాలని ఉంది. లేకుంటే వీడు నాకన్నా గొప్పవాడు

అవుతాడు! ఏదో ఓ యెత్తువేసి రెడ్డికి పురికొలిపి ఆ త్రినాథ వ్రతాన్ని మానిపించాలిసి వుంది. దానిచేతనే వాడికంతగా గౌరవం కలుగుతూంది. నేను మాత్రం సహింపలేను.

సీ॥ ఒక్కడు నాకన్న । నెక్కువ సంపద
లొందిన నే జూచి । యోర్వలేను;
ఒక్కడు నాకన్న । నెక్కువ పాండి త్య
మొందిన నే జూచి । యోర్వ లేను;
ఒక్కడు నాకన్న । నెక్కువ ప్రఖ్యాతి
నొందిన నే జూచి । యోర్వ లేను.
ఒక్కడు నాకన్న । నెక్కువ గౌరవం
బొందిన నే జూచి । యోర్వ లేను.

తే॥ గీ॥ శ్రీపురా చార్య వర్యుడు । శ్రేష్ఠ దశగ
దిశల యందున బ్రఖ్యాతి । దేలి యాడ
జనులు భయ భక్తులను గాంచి । వినయముగను
మెలగ వలె గాదె యాజ్ఞల । దలను దాల్చి.

(నిష్క్రమించును)

(తెర వ్రాలును.)

## పదియవ రంగము.

[ప్రదేశము: శ్రీపుర పట్టణమందలి జమీందారు రామిరెడ్డి గృహము.

ప్రవేశము: రామిరెడ్డి విచారముతో]

రెడ్డి: జమీందారుడ ననియైన యోచించినది కాదే! ఆహా! రెడ్డిగారి ప్రతాపమును గ్రుడ్డిజేసి గడ్డిపరక కన్న హీనముగా జూచినదే!—ఒక బ్రాహ్మణస్త్రీ—అందున అశక్తురాలు—అన్నమునకు వాచినది నన్నింత తేలికగా జూచునా!—ఓసి శాంతా! ఆ మధుసూదనునితో నీవేమి సుఖముల ననుభవించగలవే! నా ధనమూ నా ప్రతాపము లేశమాత్ర మాలోచింపకుంటివే! ఆ రోజు, ఆ యడవిని గనుక తప్పించుకొన గలిగితివి. ఆ మూడు పాడు పులులు రానియెడల నాడు నా ప్రతాపమును దెలిసియే యుందువు.—నేనెన్ని వార్తలు బంపినను తిరస్కారమును జేయుచునేయున్నావు. ఎన్ని కానుకలు బంపినను నాముఖమున బారవేయించు చున్నావు. నిన్నేమి చేయుదునో చూడుము. నిన్నే కఠినముగా దండించకున్న యీ రెడ్డి జమీందారుని జీవిత మెందులకు? అంత కండ్ల కావరమా! అంత మర్యాదా హీనమా!

ఆచార్యుడు: (ప్రవేశించును)

రెడ్డి: ఆచార్యుల వారికి నమస్కరించు చున్నాడను.

ఆచా: శుభం! మంగళాని భవంతు.

రెడ్డి: ఆచార్యుల వారి రాకవలన ధన్యుడను.

ఆచా: రెడ్డీ! నన్ను పితృసమానంగా చూస్తూ గౌరవిస్తూంటావు. నాకదే యానందం.

రెడ్డి: మీరు నా పితృసమానులు గారా! నాగురువులు, నా మేలు గోరు చుండెదరు.

ఆచా: ఇప్పుడు నీమేలు కోరాలిసే వచ్చా! మన శ్రీపురంలో ప్రజలంతా శ్రీమంతులై ధన ధాన్యాలలో తుల దూగుచున్నారు.

రెడ్డి: అందువలన మనకు సంతోషమే గదా!

ఆచా: రెడ్డిగారి కంటే ప్రజలు వెయ్యి రెట్లు ధనవంతులై యుంటే రెడ్డిగారి గొప్పతన మేముంటుందీ?—

రెడ్డి: ఏమేమి! రెడ్డిగారి ఘనతయే లేదా?

ఆచా: ఇంకా రెడ్డిగారి అధికారం క్రింద ఓ పురుగైనా మెలగుతుందీ? వెఱ్ఱివాడా!

రెడ్డి: మీ మాటలకు నాకు నవ్వు వచ్చుచున్నది. రెడ్డిగారి ప్రతాపమునకు గాని, కీర్తిప్రతిష్ఠలకు గాని, అధికారమునకు గాని, ధనమునకు గాని శ్రీపురము నందడ్డురాగలవాడెవడు? అట్టివానికి ప్రాణముల పై నాసలేదా?

ఆచా: వీరూ వారూ అనట మెందుకు? ఎవరుబడితే వారే గొప్పవారుగా నుంటే ఇంకా నిద్రపోతున్నావూ!

రెడ్డి: నా యాజ్ఞలోను నా యధికారములోను గల ప్రజలు నాకన్న అధికు లెట్లు కాగలరు?

ఆచా: శాంతనీ మధుసూదనుణ్ణీ ఎరుగుదువు గదా?

రెడ్డి: (చకితుడై) ఆ!—శాంత, మధుసూదనం—ఆహా?

ఆచా: వాళ్లు కుటీరం దగ్గర త్రినాధులని మూడు రాతి విగ్రహాలు పెట్టి ప్రజలచే త్రినాధ వ్రతమని ఓ వ్రతంచెయిస్తూన్నారు. ఆ వ్రతం చేసిన వారంతా చెప్పలే నటువంటి భాగ్య వంతు లవుతున్నారు. అంచాత దాన్ని మానిపిస్తే గాని నీవు చాలా యిక్కట్లు పాలవుతావు—అంతా ధనవంతులైతే నీమాట నెవరైనా మన్నిస్తారు?

రెడ్డి: వ్రతము, గితము; ఎవరా వ్రతముజేసి నాకన్న గొప్ప వార లయ్యేదరు? నేటినుండి ఆ వ్రతము చేసినవారిని చెట్టునకు గట్టించి చీలలు వేయించి కాళ్లు చేతులు నరికించి చిత్ర వధలు చేయింతును. ఇది నా కఠినమైన ఆనుజ్ఞ. దీనిని ప్రజలందరూ శిరసావహించి పాటించవలెను.

ఆచా: సెబాస్! సెబాస్! అలా కాకుంటే ప్రజల్లో నీ యాగడం విడవదు. ఆ శాంతా మధుసూధనులే దీనికి కారణం.

రెడ్డి: (ఆగ్రహమున) శాంతా—మధుసూదనం—వారికి రెడ్డిగారి ప్రతాపము తెలియకున్నది. ఇంక తెలియజేయగలను.

ఆచా: నీ భయం కొంచెమైని ఉన్నట్లు లేదు. ఉంటే అలా చేస్తారూ?

రెడ్డి: నిజము ఆచార్యా! నిజము. వారికి నాకడ లేశమైనను భయములేదు. నే నెరుంగుదును. మంచి సలహా నొసంగితిరి. వారికి దగిన ప్రాయశ్చిత్తము జేయవలసియున్నది.

ఆచా: ఆ విగ్రహాల్ని ఊడ పెరికించి పారవేయించితేనే తప్ప ఆ దుండగం అణగదు.

రెడ్డి: ఆచార్యా! తండ్రితో సమానులగు తమతో నా మనస్సు నందలి విషయములు తెలియజేయుటకు సంకోచ పడను—ఆ—శాంత ను—మనసార—ప్రేమించి యున్నాను.

ఆచా: బలే! నీలాంటి వాని ప్రేమయే కలిగి యుంటే దాని కేం కావాలి! ఇంకా స్వర్గానికి పోవాలి అది.

రెడ్డి: ఏమి లాభము? నన్ను తిరస్కారభావమున జూచుచున్నది.

ఆచా: ఏమిగా?—ఏమీ?—నిన్ను తిరస్కారంగా చూస్తూ వుందీ?—నిన్నే?—నిన్నే?—ఆహా! ఎంత ధైర్యం వహించిందీ?

రెడ్డి: నేను దాని భోగములనే పొందకున్న యీ ప్రాణము లేల? ఈ విభవములేల? ఈ శ్రీపురమేల?

ఆచా: అయ్యో! అయ్యో! అంతపని యెందులకూ? చిటికెలో అది నీ సొంతము కాదూ!—చూడూ! వారు నీ శాసనాన్ని పాటించి ఆ వ్రతాన్ని విడవలేరు. అప్పుడు దండనకు చిక్కుతారు. అంగుపై జరుగ వలసిన కథంతా జరుగుతుంది?

రెడ్డి: సరే, ఇంక మీరు పొండు. వారి నేరములను గుర్తించి నాకు దెలియ జేయుడు—సమయమును నిరీక్షింపుచుండుడు—తక్షణమే నాశాసనమును ప్రకటన జేయించెదను.

ఆచా: నే వెళ్లుచున్నాను. చిటికెలో వారిని తీసుక రానూ! (నిష్క్రమించును)

(తెర వ్రాలును.)

★



సీరియల్ నాటిక

# భక్తిలీల

శ్రీ లాకా శ్రీనివాసరావు

[మధుసూదనుఁడు ప్రజలందఱిచే త్రినాథ వ్రతము చేయించుచూ వారి ఆదరమును చూరగొన్నాడు. పుర ఆచార్యునికి ఇది అసూయా కారణముకాగా, గ్రామపెద్దయైన రెడ్డిని పురిగొల్పి, వ్రతము మాన్పించే ఏర్పాట్లు చేయ మంటాఁడు. మధుసూదనుని భార్యయైన శాంతను వలచి నిరాకరింపబడ్డ రెడ్డి, పగసాధింపు కిది యొక ఉపాయమని యియ్యకొంటాఁడు. తరువాత చదవండి.]

## 11-వ రంగము

[ప్రదేశము : శ్రీపుర వీధి, ప్రవేశము : తలారి టమటమా వాయించుచు]

తలారి : ఒహోయ్! జనులారా! త్రినాథ వ్రతం యెవ రైనా చేసినా, యెవరైనా చేయించినా వారిని చెట్టునకు కట్టించి, ఇనుప చీలల కొట్టించి, మాంసకండలు పెరికించి కాకులకు గ్రద్దలకు వేయుదురుని. ఇంకా అనేక రకాలుగా చిత్రకథలు చేయబడుతుం దోహోయ్!—ఇది శ్రీ శ్రీ శ్రీ శ్రీపురం జమీందారు రామిరెడ్డిగారి శాసనం గనుక యీ శాసనాన్ని యెవరున్నూ అతిక్రమించి త్రినాథ వ్రతము చేయరాదోహోయ్!!!—

(తెర వ్రాలును.)

## 12-వ రంగము.

[ప్రదేశము : శ్రీపుర వీధి, ప్రవేశము : ఆకలి కొన్న రామన్నయను గ్రుడ్డి బాలుడు.]

రామన్న : ఆహా! లేదు లేదు. పట్టెడు కూడు పొట్టకు లేదా? ఓయి ధనవంతా! నీవేమి మూటగట్టుకొని పోతావు? నీవు మాత్రము అన్నమూ ఉప్పూ తింటావుగాని బంగారం మ్రింగలేవుగదా! మావంటి పేదవారిని హీనంగా ఱాది నీవేమి సుఖాలను పొందుతున్నావు?

సీ॥ మేడల లోపల । నెలగాడి ధనికుడ!
వేడుక గలదె నీ । మేడలందు?
చెట్టునీడ వసించి । కష్టముల మరచి
వేడుకగా నుందు । వాడ నేను.
అందమౌ మంచము । నందు బానుపునైచి
పవళించి సుఖముల । బడయ గలవె?
కఠినమౌ నేల దుః । ఖము పానుపు బరిచి
పవళించి హాయిగా । బడుదు దృష్టి.

తే॥ గీ॥ కూడు గుడ్డల కేనాడు । గొదువ లేక
గొలుచు చుండవు దేవుని । గుణ విహీన!
కూడు గుడ్డల కెన్నడు । గొదువ కలిగి
కొలుచు చుండెద దేవుని । గోర్కెతోడ!

చిన్నరెడ్డి : (ప్రవేసించి) నిజము రామన్నా! నిజము. ఈ ధన ధాన్యములతో నేమి పని? ఒక గడ్డి పోచయైనా మన వెంట వచ్చునా? రావు, రావు. అందరమూ ఆ జేనడు పొట్టకే బాధపడుచున్నాము. ఈ మాత్రము

చిన్నపొట్ట పోషించుకొనుటకే ఎన్నో తంత్రములు, ఎన్నో అబద్ధములు, ఎన్నో హత్యలు చేయుచున్నాము.

రామ : నాయనా! నీ వెవరవు?

చిన్నరె : నేను రామిరెడ్డిగారి కుమారుడను.

రామ : ఏమో! చిన్న రెడ్డిగారా?

చిన్నరె : ఔను రామన్నా!

రామ : నిన్నటినుండి కడుపున కింత తిండి దొరకినది కాదు. ఆకలి బాధకు ప్రాణాలు అలమటిల్లి పోతూన్నాయి.

చి॥రె : రామన్నా ఈ పండుతిని ఆకలి తీర్చుకో! అనక మాయమ్మతో జెప్పి అన్నమును బెట్టింతును.

రామ : (పండు తీసికొని తింటూ) నీవు చాల పుణ్యాత్ముడవు రెడ్డీ! ధర్మధాతవు. నాకే కండ్లు కనిపిస్తే కూలో నాలో చేసుకొని యీపొట్ట పోషించుకొనలేక పోదునా?

చి॥రె : ఇక్కడికి కొంచెము దూరములో మధుసూదనుని కుటీర మున్నది. అక్కడ త్రినాధ స్వాములవారి విగ్రహము లున్నవి. అక్కడకు పోయి స్వాములను పూజించి నట్లయిన నీ కండ్లు కనిపించును. ఆ దేవతలను పూజించుము.

రామ : నాయనా! అక్కడకు నన్నెవరు తీసుక వెళతారు? త్రోవ తెలియదే!

చి॥రె : నేను తీసుక వెళ్లెదను రా!

రామ : వద్దు నాయనా! నీవు గొప్పయింటి బిడ్డవు. అంత దూరము రావద్దు. మీ యమ్మా మీ నాన్నా కోప పడతారు. నీవు రాకుము. దేవుడింకెవరి నైనా తోడు కలుపుతాడు.

చి॥రె : రామన్నా! నన్ను మాయమ్మా మానాన్నా కోప పడరు. ముద్దుగా జూతురు. అయినను ఒకరి కొకరు సహాయము జేసుకొనకున్న నెట్లువును? మనుష్యులమై ఎందుకు పుట్టవలెను? మనకు దేవుడెందుకు జ్ఞాన మిచ్చెను? దానిని వినియోగించవద్దా?

తే॥ గీ॥ శక్తి మాలిన వారికి । శక్తి కొలది
జేయ వలయును గాదె స । హాయ మిలను
మానవుని కేల దేవుడు । జ్ఞాన మొసగె?
దాని వినియోగ పరచుటే । ధర్మ పథము.

పోవుదము, రా! (నిష్క్రమింతురు.)

(తెర వ్రాలును)

## 13-వ రంగము.

[ప్రదేశము: మార్గము. ప్రవేశము : కొందరు పిల్లలు భజన జేయుచు మధుసూదనుని కుటీరమునుండి శ్రీపురమునకు బోవుచుందురు.]

పిల్లలు :—

త్రినాధ స్వాముల స్మరించ రండీ!
తీరును కష్టము నరులారా!
త్రినాధ స్వాములు ధన ధాన్యంబులు
స్థిరముగ నిత్తురు నరులారా!
మూడు కానులే చాలును వారికి
మూర్ఖము విడుడో నరులారా!
మూడు మూర్తులను మ్రొక్కిన వారికి
మోక్షము గలదో నరులారా!
వక్కలాకులును సాంబ్రాణి నూనెతో
వ్రతము జేయుడీ నరులారా!
చక్కగ స్వాముల మదిలో దలంచి
సంతస మొందుడి నరులారా!

(ప్రవేశము : చిన్నరెడ్డి గ్రుడ్డి రామన్నతో)

చి॥రె : అన్నలారా! శ్రీ త్రినాథస్వాముల దర్శనమునకే వచ్చుచున్నారా?

పిల్లలు : ఔను, రెడ్డన్నా! ఔను.

అనంతుడు : అక్కడ ఏమి మహత్తు! ఏమి మహత్తు! దేవుళ్లకు తప్పక మ్రొక్కాలి!

బైరాగి : అన్నా! త్రినాథ స్వాములవారికి మ్రొక్కినాకు మూగ వదలిపోయింది. మాటలు వచ్చెనికా! ఇప్పుడు చక్కగా మాట్లాడుతున్నా!

అనం: నాకూ పొట్ట పోయి నడచుటకు కాళ్లు వచ్చాయి రెడ్డన్నా!

నారాయణ: నాకున్న రోగం పోయి శరీరం ఆరోగ్యంగా నుంది, అందం కూడా కలిగిందన్నా! నాకురూప మంతా వదలిపోయిందన్నా!

చి॥శ: అన్నలారా! త్రినాథులను భజించిన వృథయగునా? మోక్షము కలుగును.

పిల్లలు: మేము యీనాటినుండి దేవుని భజన విడువము రెడ్డన్నా! విడువము. మేము బైరాగుల మైపోతాము.

చి॥శ: అన్నలారా! ఇంత చిన్న వయస్సు నందే వైరాగ్యము బొందవచ్చునా?

నారా: ఏమి! ప్రహ్లాదుడు పిల్లవాడు కాడా?

అనం: ధృవుడు మహాభక్తుడు కాడూ?—చిన్నప్పుడే దేవుని భజనజేసి మోక్షము బొందలేదూ?

బైరా: చిన్ననాటినుండీ భజిస్తేనే మోక్షం లభిస్తుంది. పెద్దవార మయేక ఎలా భజించినా భజించవచ్చు. కానీ యీ చిన్నతనంలో చేసే పాపాలన్నీ ఏమవుతాయి? కొండలవలే పెరగవూ?—కనుక చిన్ననాటినుంచీ దేవుని భజించాలి!

చి॥శ: నిజముగా దేవుని భజించుట వల్లనే మానవులు తరింతురు. కానీ, జ్ఞానమైన మానవ జన్మమెత్తి దేవుని భజించకుండా ఎందరో పాపముల జేయుచూ అధోగతి పాలగుచున్నారు.

బైరా: నేను రాబోవు జన్మములో మనుష్యుడనై పుట్టనన్నా! తుమ్మెదనై పుడతాను. ఏమందువా?—శ్రీమన్నారాయణుడు తామర పద్మముపై నిలిచివుంటే అక్కడకువెళ్లి ఆ పద్మంపై వ్రాలి ఆ దేవుని సన్నిధిని పాదసేవ చేయొచ్చు. మానవుడై పుడితే అక్కడికి పోవడానికి వీలుకలుగదు. కనుక తుమ్మెదనై పుడతాను.

తుమ్మెదనై ఝుంఝుంమ్మనుచు, కమ
లమ్మున గూర్చొని స్వామికి జే! జే!
పాడెదను.

అనం: కోయిలనై కూ! కూ! కూ! కూయుచును స్వామికి
స్వాగత మేనిత్తున్.

నారా: నెమలిని నేనై రమణీయముగా నాట్య
వినోదము సలిపెదను.

చి॥శ: అన్నలారా! మీ భక్తి కొనియాడదగి యున్నది. మీరు భక్తి పూర్ణులు. మొక్క మొలిచినప్పుడే చక్కని ఆకులు వేయవలెను. ఇంక నాకు సెలవీయుడు పోవలెను.

బైరా: అన్నా! ఎక్కడికి వెళ్లుచున్నావు?

చి॥శ: నేనూ స్వాములవారి సన్నిధికే, ఈ గ్రుడ్డి రామన్నను తోడుకొని పోవుచున్నాను.

బైరా: వేగం వెళ్లండి. తప్పక రామన్నకు కండ్లు కనిపిస్తాయి, స్వాములవారికి మ్రొక్కండి.

చి॥శ: అట్లే వెళ్లుచున్నాము.

పిల్లలు: రెడ్డన్నా! సెలవు, సెలవు.

చి॥శ: సెలవు. (రామన్నతో నిష్క్రమించును)

(తెర వ్రాలును.)

## 14-వ రంగము.

[ప్రదేశము: శ్రీపుర పట్టణ సామీప్యము. ప్రవేశము: పిల్లలు త్రినాథుల భజన చేయుచు పట్టణమునకు బోవుచుందురు.]

పిల్లలు: త్రినాథ స్వాములు—త్రిలోక నాథులు
త్రినాథ స్వాముల—స్థిరమని మ్రొక్కిన
ధన ధాన్యంబులు—దండిగ గలుగును.

నారాయ: ఒరేయి! ఈ త్రినాథస్వామి లెలాంటి వాళ్లురా?

అనం: ఎరుగవురా?

గ్రద్ద నెక్కినవాడు—ఎద్దు నెక్కినవాడు
హంస నెక్కిన వాడు—హరి హర బ్రహ్మ.

(ప్రవేశము ఆచార్యుడు తుంబాజీ అను శిష్యునితో)

ఆచార్యు : ఒరేయ్! పిల్లలూ! ఒరేయ్! పిల్లలూ!

(పిల్లలు తన్మయత్వంతో భజన చేయుచుందురు)

ఆచా : ఒరేయి పిల్లలూ! యిటు వినండ్రా!

పిల్లలు : ఏమండీ! ఏమండీ! ఏమండీ!

ఆచా : త్రినాధుల భజన చేస్తే రెడ్డిగారు దండిస్తారు తెలుసా ?

భైరా : ఎందుకండీ దండిస్తారు ? ఇది తప్పు పనిగాదే! ఒక వేళ మదోన్మత్తతచే కొడితే మా ఒంటిపై కొడతారు గాని మా మనస్సును కొట్టగలరండీ!

(అనంతుడు ఆచార్యునితో వచ్చిన తుంబాజీని వెక్కిరించును.)

తుంబాజి : గురూజీ! చూడండి!—అడుగోనండీ! అడుగోనండీ! అన్నంతుడు చీమిడి కారుతూందని వెక్కిరిస్తూన్నాడు—ఊఁ!—ఊఁ!!—(ఏడ్చును)

ఆచా : ఊరుకో తుంబాజీ! ఊరుకో! — అనంతం! తుంబాజీని వెక్కిరిస్తూన్నావా! తప్పుకాదూ ?

అనం : ఔనండీ! దేవుని భజన వద్దంటే తప్పుకాదూ ?

భైరా : ఆచార్యులుగారూ! దేవుని భజన మాన్పించడానికి ఎవరికి హక్కుంది ?—

ఆచా : మన రెడ్డి ప్రభువుకు.

భైరా : రెడ్డి దేవునికన్నా అధికుడా ? మానవుడు దేవునీ, దేవుని కార్యాలనీ ఆటంకం చేయడానికి శక్తి ఉంటే సుఖ దుఃఖాలను పొందుతాడూ ?

ఆచా : (తనలో) ఈ కుంక వెధవలికి జవాబు చెప్పటం కష్టం. వీళ్లతో నాకెందుకు వాదం! మిగిలితే యీ కాస్త జుట్టూ పీకేయగలరు.

అనం : మీ రెడ్డిగారి అబ్బాయికూడా శ్రీ త్రినాథ స్వాముల్ని భజించడానికి వెళ్లాడు. రెడ్డి ఆయన కొడుకుకే అడ్డు చెప్పలేనప్పుడు ఎలా మమ్ముల దండిస్తాడూ ?

ఆచా : ఏమీ! ఏమీ! రెడ్డిగారబ్బాయా ?

నారా : ఔనండి!

ఆచా : చిన్నరెడ్డి త్రినాధులను చూట్టానికి మధుసూదనం గాడి కుటీరానికి వెళ్లాడా ?

భైరా : చూడటానికే కాదండీ! పూజించటానికే వెళ్లాడు.

ఆచా : ఔనండీ! అలా నిర్ఘాంతపోతారేమండీ! గుడ్డి రామన్నను కూడా తోడుక పోయాడు.

ఆచా : ఒరేయ్! తుంబాజీ! వేగంగా రా! ఆ చిన్నరెడ్డి చెడిపోతూన్నాడు. వాడూ భైరాగివా డౌతూన్నాడు.

(తుంబాజీతో నిష్క్రమించును. పిల్లలు భజన చేయుచు ఇండ్లకు పోవుదురు)

(తెర వ్రాలును.)

సశేషం.



సీరియల్ నాటిక

# భక్తిలీల

పోలాకి శ్రీనివాసరావు

['ఆంధ్రమహిళ' పత్రికలో ప్రకటించబడుతున్న 'భక్తిలీల' సీరియల్ నాటిక యింతటితో ముగిసిపోయినది. ఈ నాటికలో పాత్రలన్నీ సహజముగా కనిపించుతవి. ధన మదాంధుడు, దురహంకారి అయిన రెడ్డివంటి ప్రబుద్ధులు తమ అధీనములో వున్న బీదలను దీనులను పీడించటము, స్త్రీలను నీచదృష్టితో చూడటము మామూలే. కాని వారికి జ్ఞానోదయము కావటము నిజముగా ఈశ్వర సాక్షాత్కారమే. ఆచారివంటి జోహుకుందారులు డబ్బాగాళ్లు వెనకవుండి సూత్రములను పట్టుకుని ఆడించితేనేగాని రెడ్డివంటి నాయకులు బాగా గంతులు వేయలేరు. శాంత ధృఢ నిశ్చయము సహనము గమనించతగినవి. తమ నాటికను పత్రికలో ప్రచురింపనిచ్చిన శ్రీ పోలాకి శ్రీనివాసరావుగారికి మా కృతజ్ఞత. ప్రజలు నానాటికి ఎదుర్కొనవలసి వస్తున్న సమస్యల నాధారముగా తీసుకుని రచయిత నాటికలను వ్రాయగలరని ఆశిస్తున్నాము. సం॥]

## పదునేడవ రంగము

[ప్రదేశము: మధుసూదనుని కుటీర ప్రాంతము.

ప్రవేశము: మఱ్ఱిక్రిందను గల శ్రీ త్రినాథ విగ్రహములను శాంతా మధుసూదనులును, చిన్న రెడ్డి గ్రుడ్డిరామన్నయు పూజించుచుందురు.]

శాంత: తే॥గీ॥ అల్ల కల్లోలమై యల్ల । లాడుచున్న
చిత్త సాంద్రము లోపల । భక్తి యన్న
నావ నిర్మించి దాన తైర్తి । నాథుల నిడి
యాటు లాడించు దాననే । నాడు దాన
నందు గూడెడి యాపద । లరయ రయ్యా!

చి॥ర: తల్లీ! శాంతాదేవీ! స్వాముల ప్రసాదమును యీ గ్రుడ్డి బాలునకిచ్చి కండ్లు వచ్చునట్లు దీవింపుడు.

శాంత: (ప్రసాద మిచ్చి) బిడ్డా! స్వాముల కరుణవలన కండ్లు కనుపించును చూడుము.

రామన్న: (ప్రసాదమును దిని తేరిజూచి) ఆహా! ఆహా! ఏమి నా అదృష్టము. కండ్లు కనిపిస్తూన్నాయి.

తే॥గీ॥ చేర్తు మిము మానసమున మ । మ్మూర్తులార!
కండ్లు కనుపించె మీదగు । కరుణ వలన
జూడ గలిగితి లోకపు । జోద్య ములను
భాగ్యము ఫలించె పున్నెము । పండె నాది.

చి॥ర: ఆహా! ఎట్టి సుదినము.

తే॥గీ॥ బ్రహ్మ విష్ణు మహేశ్వర । ప్రముఖులార!
మీదు దర్శన భాగ్యంబు । మీదు సేవ
పూర్వ పుణ్య ఫలంబున । బొంద గలిగె
నాదు మానస మానంద । వార్ధి దేలె.

(ప్రవేశము ఆచార్యుడు తుంబాజీతో)

ఆచా : ఒరేయ్ చిన్నరెడ్డీ! ఏమిటూ పెంకిపని—ఓ మధుసూదనం! ఓ శాంతా! రెడ్డి ప్రభువు త్రినాధ వ్రతము చేయరాదని కఠినంగా శాసిస్తే ఆయన ఆజ్ఞకు వ్యతిరేకంగా మీరు వ్రతాలు చేస్తారూ? మీ భరతం పట్టిస్తానుండుండు—ఒరేయి తుంబాజీ! నీవు వేగిరం వెళ్లి ఆ రెడ్డిని పిలువు. వేగిరం వెళ్లు.

తుంబ : ఆలాగేనండి! (పోతూ) ఈ చీమిడి కారటం ఆగిపోతే అప్పుడు దేవుళ్లను నమ్ముతా! (పోవును.)

ఆచా : ఈ చిన్న పిల్లల్ని చేతిలో కొంచెం ప్రసాదం పెట్టి యిలా సాదుల్ని చేస్తున్నారూ! మీకు శిక్ష పొందటానికి సమయం వచ్చెను తాళండి!

శాంతి : ఆచార్యులుగారూ! అన్నియు తెలిసిన మీరే యిట్లజ్ఞానము జెందవచ్చునా?

ఆచా : ఇంకా నోరు మూసికొని చక్కా ఊరుకోక నన్ను అజ్ఞానంటున్నావూ?

మధు :—శ్రీ త్రినాధులను పూజించుట తప్పా? సకల శాస్త్రము చదివిన తామే నిందించ వచ్చునా?

చి॥రె : ఈ ఆచార్యుడు చదువుకొన్నంత మాత్రమున ఫలితమేమున్నది?

తే॥గీ॥ పండితుండని లోకము । పలుక వచ్చు
సకల శాస్త్రాలు చక్కగా । జదువ వచ్చు
దాని వినియోగ పరచని । వాని కన్న
బశువు మేలని చెప్పగా । వలయు భువిని.

శాంత : మహా పండితులు మీకు మేము ధర్మముసు జెప్పవలయునా?

ఆచా : చాలు చాలు! నోర్మూయండి. నోటికి వచ్చినట్లు వాగకండి. ఈ బొమ్మల్ని ఊడబెరకి అవల పారవేయిస్తా రెడ్డి వస్తే.

శాంత : మా దేవుళ్లను మాత్రము నిందించవద్దు.

ఆచా : ఈ నోరులేని రాతిబొమ్మ లెలా దేవుళ్లవుతారు? కాళ్లతో త్రొక్కిన రాళ్లు దేవుళ్లట! చాలించు కాషాయి వస్త్రాలు కట్టుకొని, తులసి మాలలు వేసుకొని దేవుడా! దేవుడా! అని అరిచితే దేవుడు ప్రత్యక్షమవుతాడూ? ఈలాంటి కపట వేషాలు వేసుకొని పొట్ట నింపుకుంటూన్నావు. ఆ రెడ్డి నాశ్రయించ కూడదూ? పొట్టకు పట్టెడు దొరుకదూ?

శాంత : ఆహా! ఎంతటి దౌర్జన్యము.

(ప్రవేశము రామిరెడ్డి)

ఆచా : రెడ్డీ! చూడూ! ఈ శాంతకూ ఈ మధుసూదనంగాడికి ఏ మాగడం? నీ అధికారాన్ని అతిక్రమించి త్రినాధుల వ్రతం చేస్తూ యీ చిన్నరెడ్డినీ ఆ అడుక్కున్న వెధవనీ బైరాగివాళ్లుగా చేశారు. కఠినంగా దండన విధించాలి—చిన్నరెడ్డీ! నీవు ఇంటికి పో, ఏయ్! అడుక్కున్న గుంట వెధవా! ఎవడవురా నీవు? పో!—ఆ—పో!

రామ : నేనేమి తప్పు చేశానండీ!

ఆచా : నీకు శాస్తి కావాలా పోతావా లేదా? (రామన్న పోవును)—చిన్నరెడ్డీ! నీవూ వెళ్లు.

చి॥రె : నేను మీతో వచ్చెదను లెండి.

ఆచా : ఏయ్! శాంతా! రెడ్డియొక్క పాదాలు పట్టుకొని నేరాన్ని వప్పుకొని తాను చెప్పేటట్టు తిరుగు. బాగుపడి పవిత్రానికి వస్తావు. (రెడ్డితో రహస్యముగా) మంచి అవకాశం లభించింది. కొంచెం బింకం చూపెడితే నీ వద్దకు పరుగెత్తుకొస్తుంది.

రెడ్డి : చిత్తం, చిత్తం. అట్లే చేయుదును. (మధుసూదనునితో) మధుసూదనా! ఏమీ నా యాజ్ఞకు విరుద్ధమా? అంత కండ్లుకానని చేతలా? త్రినాధ వ్రతము చేయరాదని ప్రకటింపబడినది. తిరస్కార భావమున యీ వ్రతము జేయుచున్నందుకు నీవూ నీ భార్యా దండనార్హులు. ఈ నేరమున కేమి జెప్పుకొనెదవు?

మధు : ప్రభూ! దేవుని పూజలు మాన్పింప వచ్చునా?

రెడ్డి : నోర్మూయి! నాయాజ్ఞ నుల్లంఘింతువా?— ఆచార్యా! మొదట వీనిని ఆ చెట్టునకు గట్టుడు.

పిమ్మట యీ శాంతను విచారించి దండన విధించ బడును.

(ఆచార్యుడు మధుసూదనను నొక చెట్టునకు గట్టును)

శాంత: హా! ప్రభూ! ప్రభూ! నా పతిని పగ్గములచే గట్టించు చుంటివా! ఇది ధర్మమేనా?—త్రినాధుల భజించునంత మాత్రమున దయా దాక్షిణ్యము లేక దండన విధించుచుంటివా?

రెడ్డి: దయా దాక్షిణ్యామేల లేకుండును? నీకు లేకుండిన నాకును లేకుండును. ఇంక నీ నేరమున కేమి దెల్పు దువు?

శాంత: ఆహా! దేవుని భజించుట నేరమా?

రెడ్డి: నోర్మూయి! మన్నూ మిన్నూ గానక సంచరించు చున్నావు. అన్ని కార్యములలోను నన్ను దిరస్కరించు చున్నావు—ఇంకనైనను నన్ను ప్రేమించి నా యుద్దేశ మంగీకరించిన మీ నేరములను మన్నించి దండన తప్పించ బడును. ఏమనెదవు?—తుది పలుకు బలుకుము.

శాంత: (బిగ్గరగా) ఆహా! ఎట్టి పాపపు మాటలు వినవలసి వచ్చుచున్నది. త్రినాధులారా! త్రినాధులారా? రక్షింపుడు.

రెడ్డి: నోర్మూయి! నీ దేవుళ్ళూ గీవుళ్ళూ జూచెదను.

చి॥రె: నాన్నా! తప్పు, తప్పు. ఆమెను బాధించవద్దు. పాపము—దేవుళ్లను నిందించరాదు. హిరణ్యకశిపు డేమైనాడు?

రెడ్డి: నీవు ప్రహ్లాదుడవూ నేను హిరణ్యకశిపుడను, పో కుంకా!

చి॥రె: అది ప్రహ్లాదనాటకము, ఇది త్రినాధ నాటకము.

ఆచా: చిన్నరెడ్డీ! తప్పు అలా జవాబు చెప్పక.

రెడ్డి: శాంతా! జవాబు చెప్పవంటివేమి? నన్ను ప్రేమిం చెదవా లేదా?—నీ నేరమున కేమందువు? మాటాడ వేమి?—మాటాడవేమి?

ఆచా: ఆ బొమ్మలు రక్షిస్తాయని నిన్ను తిరస్కారము చేస్తూంది.

రెడ్డి: (ఆగ్రహమున) ఈ రాతి విగ్రహములా మీ దేవుళ్లు. అయిన మీ దేవుళ్లెట్టివారో జూచెదను. (కత్తిదీసి విగ్రహములను నరుకబోవ శాంతాదేవి అడ్డు నిలుచును)

శాంత: ఆ! ఆ! ఆ! ప్రభూ! రెడ్డి ప్రభూ! దొరా! దొరా! నా కన్న తండ్రులను హింస జేయకుము. నా దేవుళ్లను ఛిద్రము జేయకుము. నా రక్షకులను—జగ ద్రక్షకులను గొట్టకుము. వారికి బాధ గలుగనీయకుము. మనస్సు నొచ్చును. నిన్ను బ్రతిమాలుకొందును, నన్ను జంపుము, నన్ను గొట్టుము, నన్ను నరుకుము.

రెడ్డి: (ఉద్రేకమున) నిన్నే నరికెదను—నిన్నే—చూడు—నిన్నే—నరికెదను—చిత్రవధ జేయుదును.

చి॥రె: నాన్నా! నాన్నా! నన్ను నరుకుము. నన్ను జంపుము. నా ప్రాణములను దీయుము. నన్ను జిత్రవధ జేయుము. నా ప్రాణము లెట్టివో ఈమె ప్రాణములు, నీ ప్రాణములు, అతని ప్రాణము లట్టివే!

(ఒక పాము అచ్చటకువచ్చి ఆచార్యుని వెంటబెట్టును.)

ఆచా: అయ్యో! పాము, పాము. (పరుగున పోవును)

(పాము ఆచార్యుని విడిచి రెడ్డి దెస దిరుగును)

రెడ్డి: ఓ సర్పమా! నా దెసకు వచ్చుచుంటివా! నీకాల మాసన్నమైనది రమ్ము. (రెడ్డి కత్తినిదూసి నరుకబోవ సర్పము చిన్నరెడ్డిని పొడిచి అదృశ్యమగును. చిన్నరెడ్డి మూర్ఛిల్లును. అందరూ నివ్వెరబోయి భయకంపితు లగుదురు)

రెడ్డి: హా! చిన్నరెడ్డీ! రెడ్డీ! నాయనా పలుకవేమి?—మూర్ఛిల్లితివా? తండ్రీ! చిన్నరెడ్డీ! తేరిజూడుము—తల్లీ! శాంతాదేవీ! రక్షింపుము. నీ పాతివ్రత్య మహాత్మ్యము వల్లనే యిట్టి దృశ్యము జూడనైనది. నా నేరములను క్షమింపుడు. అమ్మా! నా ముద్దు కుమారుని మా చిన్నరెడ్డిని బ్రతికింపుము. రక్షింపుము. జననీ! జననీ! కోపము విడనాడుము. దయ వహింపుము.

ఇదిగో నీ విభుని బంధములను విప్పుచున్నాడను— తండ్రీ మధుసూదనా! నీవైన రక్షింపుము. (మధు సూదనుని కడకు బోయి కట్లను విప్పుచుండును.)

శాంత : ఆహా! దైవ చిత్ర మెట్టిదీ!—నన్ను గాపాడ సహాయము వచ్చిన చిన్నరెడ్డి ప్రాణముల దీయుటయా! ఓ దేవతలారా! మీ చిత్ర విచిత్ర నటనమును దెలిసి కొనుట కేరితరము?—ఆహా! ఎట్టి నటనాకౌశలమును జూపెట్టితిరి! ఓ త్రినాథులారా! నాయనలారా! బ్రహ్మ విష్ణు మహేశ్వరులారా! ఈ చిన్న బాలుని— ఈ మూర్భాగతుని కండ్లార జూడలేను. రక్షింపుడు. మీ మహాత్మ్యమును జూపుడు. సదా మీ వ్రతము లాచరించువాన, శ్రీ త్రినాథ వ్రత మహత్వము జూపెట్ట రారూ! కావగా! కావ—

కం॥ రారే! శ్రీ త్రైనాథులు
రారే! కాపాడగాను। రయమున నిటుకున్
రారే! తరుణము మరువక
రారే! నా తండ్రులార! రారే! రారే!

(త్రినాథులు ప్రత్యక్షముగాగా రెడ్డి, మధుసూదనులు మమత జెందుదురు)

త్రినాథ : బిడ్డా! నీ భక్తికి మెచ్చి మా త్రినాథుల దర్శన భాగ్య మొసంగితిమి. వరముల గోరికొమ్ము.

శాంత : నాయనలారా! నా తండ్రులారా! నన్ను రక్షింప నేతెంచితిరా! ధన్యురాల, ధన్యురాలను. ఈ చిన్నరెడ్డి ప్రాణముల నొసగి కాపాడుడు.

త్రినాథ : అట్లే యొసంగితిమి.

చి॥రె : (లేచి నమస్కరించి) ఓ త్రిమూర్తులారా! లోక కల్యాణవరులారా! రక్షింపుడు, రక్షింపుడు!

త్రినా : బిడ్డా! నీ భక్తికి మెచ్చితిమి.

శాంత : దేవతలారా! నాదొక కోరిక గలదు. దాని ననుగ్ర హింప వేడుచున్నాను.

త్రినా : తల్లీ! ఇంకను వరముల గోరుకొమ్ము.

శాంత : తండ్రులారా! మీ దర్శనమును జెందక మమత జెందియున్న నా ప్రాణేశ్వరుని యీ రెడ్డి ప్రభువును మమత దేల్చి దర్శన భాగ్య మొసంగుడు.

త్రినా : ఓ బిడ్డా! మమత దేలిరి.

రెడ్డి : (నమస్కరించి) ఓ మమ్మూర్తులారా! నా నేర ములను మన్నించి పాప పరిహారముంజేసి రక్షింపుడు, రక్షింపుడు!

త్రినా : ఓ మానవా! సర్వ ప్రాణులకంటె మీ మానవ జాతికి విజ్ఞాన మధికముగా నొసంగబడెను. అట్టి విజ్ఞానోదయమున అగ్నిలో దుముకగలవు. నీటిలో నివసించగలవు. గాలిలో నెగురగలవు. పరమాణువు మొదలు బ్రహ్మాండము వరకు బరిశోధన జేయగలవు గాని భగవంతుని జయించలేవుగదా! భగవంతు డొక డున్నాడని తెలిసికొని, పాపభీతి జెంది సకల జీవ కల్యాణమునకు నీ మానవ తేజస్సును వినియోగపరచి నీవు సంతోషించినప్పుడే దేవుడును సంతోషించును. నీ తెలివి ఏల? కాల్పనా? దానిని సక్రమముగా వెచ్చించి యింకనైన ధర్మ పథమున మనుము.

రెడ్డి : ఓ దేవతలారా! ఇంక ధర్మ మార్గమున జరించెదను. నా నేరములను క్షమించి గాపాడుడు.

త్రినా : అట్లే, గాపాడెదము.

మధు : ఓ త్రినాథులారా! మీ సందర్శన భాగ్యంబున ధన్యుడనైతిని.

శాంత : నాయనలారా! మీ సాన్నిధ్య భాగ్యమొసంగి మమ్ముల గాపాడుడు.

త్రినా : ఓ బిడ్డలారా! మీ రెల్లరును కొన్ని నాళ్లు భూలోకముననుండి మా వ్రతమును బ్రజల కుపదేశించి పిదప మా సన్నిధానమును బొందుడు.

చి॥రె : ఓ దేవతలారా! మీ వ్రతమునందొక సందేహము నాకు గలుగుచున్నది. తెలిసికొనవచ్చునా?

త్రినా : బిడ్డా! నీ సందేహమేమో గ్రహించితిమి. దీప ధూప తాంబూలాదుల మాత్రమే సమర్పించు టేల ననియేనా?

చి॥శ: నిజము స్వాములారా! నిజము. మిక్కిలి సామాన్య మైన పదార్థములనే అర్పించుట కేమి హేతువో దోచుటలేదు.

త్రినా: సర్వాంతర్యామి సర్వ వస్తువులలో నిమిడియుండ యేవస్తు వర్పించినను యర్పించచున్నను, నీలోనున్న వస్తువే తృప్తిగా నపేక్షింప బడును. ఆ దేవ వస్తువే నీ చిత్తము. దానిని నిశ్చలముజేసి భగవంతునకు సమర్పించు నదే భక్తి. కానీ మానవులు మతాది నియమములకు లోనై, దేశకాల పరిస్థితులకు తమ తమ మనోవాంఛిత వస్తువు లనేక రికముల సమర్పించి తిరిగీ భగవంతుని ప్రసాదముగా వానినే గొనుచున్నారు. వస్తువులను స్వీకరించుట వలననున్నూ, తాము నియమా నియమముల వల్లనున్నూ కలిగెడి మంచి చెడ్డల ఫలితములు మీరే మీ లోకమున బొందగలుగుచున్నారు. కానీ మీకు మాత్రము భక్తియే ప్రధానమైన వస్తువు.

చి॥శ: ధన్యోస్మి, ధన్యోస్మి.

త్రినా: ఓ బిడ్డలారా! భూలోకమున భక్తికి ప్రాధాన్య మొకటి మాకెట్టి పదార్థాపేక్షయు తారతమ్య భేదమును లేదనుటను, జాతి మత భేదములు లేకుండా, ధన వంతులు ధనహీనులు, శక్తివంతుల శక్తిహీనులు, అను తారతమ్యములు లేకుండా ఫలపత్రాది పుష్ప నియమ ములు లేకుండా; ఉపవాసాది క్లేశముల పాలు బడ కుండా మమ్ముల భజించి తరించుట కొరకే నవీన వ్రతమును దీపధూప తాంబూలాదులతో మాత్రము మూడు కానుల వెచ్చముతో నియమించి కల్పింప బడినది. భక్తి తత్త్వమెరిగి ముముక్షువులు గండు.

తే॥గీ॥ చల్లనౌ మాదు చూపుల । జల్లగాను
జల్లి బ్రోతుము జగములు । జయము గాంచ
సలలితంబగు భక్తిచే । సంతసమున
మమ్ము భజయించి పరమ మో । క్షమ్ము గనుడు

నారదుడు: (ప్రవేశించి)

తే॥గీ॥ సాధనము ముక్తిగాంచ నై । సాధువ్రతము
వ్రతము జేయరె మూలము । భక్తి యొకటె
భక్తి తత్త్వ మెరింగి మీ । శక్తికొలది
వ్రతములను జేయుడీ ముక్తి । బడయుట కొరకు.

త్రినా: బిడ్డా! నారదా! నీ యభీష్టము దీరినదా?

నార: మీ దయావశము జెల్లుచున్నపుడు భక్తుల కేమి కొరత నాయనలారా!—ఓ భక్తులారా! భక్తిలీల శ్రీ త్రినాథ వ్రత మహాత్మ్య నాటకము నెరింగితిరి. స్వాముల భజింతము.

జే! జే! జే! జే! భారతి రమణా!
జే! జే! జే! జే! లక్ష్మీ రమణా!
జే! జే! జే! జే! గిరిజా రమణా! జాయ్!!!

(తెర వ్రాలును)

సమాప్తము.

[ఈ నాటకమును వరుసగా ప్రచురించుటకు ప్రారంభించి రెండు రంగములు ప్రచురించి "వెలుగు" పత్రిక నిలిచిపోయెను. పిమ్మట మొదటి రంగమునుండి ఏడవ రంగము వరకు ప్రచురించి "ప్రబోధ" పత్రిక నిలిచి పోయెను. "ఆంధ్రమహిళ" పత్రిక మొదటినుండి పూర్తిగా ప్రచురించి సహకారము గావించెను. ఈ పత్రికల అధిపతు లకు కృతజ్ఞతాభి వందనముల నర్పించుచున్నాను.

భాషాభిమానులు దీనిని పుస్తక రూపమున అచ్చొత్తించి ప్రచార యోగ్యము గావించవలసిన దనియు, అట్లు సహాయ మొసంగువారికి కాపీరైటు హక్కులు ఉచితముగా సమ ర్పించగలననియు వందన పూర్వకముగా తెలియజేయు చున్నాడను.

ఇట్లు విధేయుడు.
బాలబంధు, పోలాకి శ్రీనివాసరావు.
బూరవెల్లి, ఉత్తర విశాఖ జిల్లా.